# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

హైదరాబాద్
20-9-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 180

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





# రేవంత్ చేతిలో బ్రహ్మాస్త్రాలు!

కెసిఆర్ పై తొలుత భూ అస్త్రం

తర్వాత లగ్జరీ ఆస్తుల చిట్టా

రెండేళ్ల కిందటే

సంపాదించిన ముఖ్యమంత్రి

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో**

తెలంగాణలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కెసిఆర్ కుటుంబ ఆస్తులకు సంబంధించిన అంశం ఇప్పుడు పొలిటికల్ గా హైలెట్ అవుతోంది. మొన్నటి వరకు సీఎం రేవంత్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసింది గులాబీ పార్టీ. అయితే దానిని వ్యూహాత్మకంగా తిప్పికొట్టారు రేవంత్.

- మిగతా 2వ పేజీలో



## బొత్స కు బంపర్ ఆఫర్!

ఫ్యామిలీ ప్యాకేజీ ప్రకటించిన జగన్

భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా కుమార్తె డాక్టర్ అనూష

విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి యధావిధిగా బొత్స ఝాన్సీ లక్ష్మి

నెల్లిమర్ల నుంచి కుమారుడు డాక్టర్ సందీప్

చీపురుపల్లి నుంచి బొత్స, గజపతినగరం నుంచి తమ్ముడు అప్పల నరసయ్య



3లో

## భీమిలిపై గుడివాడ కన్ను!

వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ పదవి కోసం అమర్నాథ్ ప్రయత్నం

సజ్జల రామకృష్ణారెడ్డి ద్వారా అధినేతకు రాయబారం

స్థానిక నాయకత్వం వైపే జగన్ మొగ్గు

మాజీ మంత్రికి షాక్

2లో

## అండమాన్‌లో అల్పపీడనం..

మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండం

ఉత్తర అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం

వాయుగుండంగా బలపడి ఉత్తరాంధ్ర తీరం వైపు పయనం

## అకస్మాత్తుగా తెరపైకి ప్రదీప్ రెడ్డి



### అదంతా తనదేనంటూ బోర్డులు

### కొట్టిపారేస్తున్న కాంగ్రెస్ నేతలు

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ రాజకీయమంతా ఇప్పుడు భూముల చుట్టూ, ఫామ్ హౌస్ ల చుట్టూ తిరుగుతోంది. శాసనసభలో కెసిఆర్ ఆస్తుల వివరాలను ప్రకటించారు సీఎం రేవంత్. అంతటితో ఆగకుండా ఫామ్ హౌస్ ప్రస్తావన కూడా తీసుకొచ్చారు. అందులో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భూములను గుర్తించేందుకు రెవెన్యూ యంత్రాంగాన్ని రంగంలోకి దించారు. మరోవైపు కేటీఆర్ ఫామ్ హౌస్ పై కూడా కాంగ్రెస్ పార్టీ దండయాత్ర ప్రారంభించింది. కేటీఆర్ అక్రమాస్తుల్లో జన్వాడ ఫామ్ హౌస్ ఉంది అంటూ కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా జీవో 111 పరిధిలో నిర్మించినట్లు ఆరోపణలు ఎదురవుతున్న క్రమంలో ఆసక్తికర అంశం బయటపడింది. ఈ లగ్జరీ ఫామ్ హౌస్ తమదేనంటూ బిల్డర్ ప్రదీప్ రెడ్డి మీడియా ముందుకు

- మిగతా 3వ పేజీలో




తెలంగాణలో మరో ఎన్నిక అనివార్యం అయ్యేలా ఉంది. దానం నాగేందర్ పై అనర్హత వేటుతో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక తప్పేలా లేదు. తెలంగాణ హైకోర్టు ఆయనపై అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది కానీ.. ఈ అనర్హత వేటులకు సంబంధించి అత్యున్నత న్యాయస్థానం కఠినంగా వ్యవహరిస్తోంది. పార్టీ ఫిరాయింపుల కేసులకు సంబంధించి సంచలన తీర్పులు ఇస్తోంది.

## ఖైరతాబాద్‌లో గెలిచేదెవరు?

### దానం నాగేందర్ పై అనర్హత వేటు

అత్యున్నత న్యాయస్థానానికి వెళ్లినా ఛాన్స్ లేదంటున్న నిపుణులు

బై పోల్ కాంగ్రెస్ తో పాటు బిఆర్ఎస్ కు సవాల్

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఈ పరిస్థితుల్లో దానం నాగేందర్ కు సైతం సుప్రీంకోర్టులో చుక్కెదురు కావడం ఖాయమని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే కచ్చితంగా ఖైరతాబాద్కు ఉప ఎన్నిక వస్తుంది.

### అనర్హత తీర్పుపై.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్

హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్

- మిగతా 2వ పేజీలో

## వైసీపీకి కోలుకోలేని దెబ్బ!

మతమార్పిడిల ఆరోపణలు

హిందూ వ్యతిరేక ముద్ర

రెడ్డి సామాజిక వర్గంలో చీలిక

మూడు అంశాలతో ముందుకు వెళ్తున్న విజయసాయిరెడ్డి




**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** విజయసాయిరెడ్డి కొత్త పార్టీ పెట్టబోతున్నారు. దసరా సందర్భంగా తన

2లో



## మద్యం కుంభకోణంలో జగన్!

అంతిమ లబ్ధిదారుడు ఆయనే..

అప్రూవర్గా మారిన a3 నిందితుడు సత్య ప్రసాద్

కోర్టుకు కీలకమైన స్టేట్మెంట్స్

మాజీ సీఎంకు త్వరలో నోటీసులు



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** మద్యం కుంభకోణంలో జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగిస్తోందా? నిందితుల్లో కీలకమైన వ్యక్తి అప్రూవర్గా మారారా? కుంభకోణంలో నగదు మొత్తం తాడేపల్లి ప్యాలెస్ కు చేరిందని చెప్పేసారా?

- మిగతా 2వ పేజీలో

## విశాఖలో 28,445 కుటుంబాలకు వరం!

నిరుపేదలు, మధ్యతరగతి వారి ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ

రూ.8,874 కోట్ల విలువగల ఇళ్లకు సంపూర్ణ హక్కులు

లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందించిన సీఎం చంద్రబాబు



- మిగతా 3వ పేజీలో

## అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్!

వంటగ్యాస్ సబ్సిడీకి బయోమెట్రిక్ తప్పనిసరి..

వంటగ్యాస్ సబ్సిడీకి బయోమెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణ తప్పనిసరి

2026 అక్టోబర్ 1 నుంచి కొత్త నిబంధన అమల్లోకి రానుంది

బయోమెట్రిక్ పూర్తి చేయని వారికి మార్కెట్ ధరకే సిలిండర్ సరఫరా

# రేవంత్ చేతిలో బ్రహ్మాస్త్రాలు!

(మొదటి పేజీ తరువాయి)

ఆధారాలు,, వివరాలతో శాసనసభ వేదికగా చీల్చి చెండాడారు. అయితే సభలో రేవంత్ ఇలా ప్రకటిస్తారని గులాబీ పార్టీ ఊహించలేదు. కానీ ఆ పార్టీ శాసనసభ నుంచి సైడ్ చేసి.. ఒక పద్ధతి ప్రకారం కల్వకుంట్ల ఫ్యామిలీ ఆస్తుల వివరాలను ప్రకటించేశారు సీఎం రేవంత్. అయితే అవి తెలంగాణ రాజకీయాలపై గట్టి ప్రభావమే చూపుతున్నాయి.

**సమయం కోసం వేచి చూసి..**

ఇప్పటివరకు కేసీఆర్ భూముల లెక్కలనే బయట పెట్టారు సీఎం రేవంత్. ముమ్ముందు అసలు లగ్జరీ ఆస్తుల చిట్టా బయటకు రానున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి సీఎం రేవంత్ ఈ ఆస్తులతో పాటు లగ్జరీ ఆస్తుల వివరాలను రెండేళ్ల క్రిందటే సేకరించారు. సమయం కోసం ఆయన వేచి చూస్తూ వచ్చారు. కెసిఆర్ ఆస్తులు, లగ్జరీ వాచ్ లు, ఖరీదైన జ్యువెలరీ వివరాలతో కూడిన పక్కా చిట్టాను రెండేళ్ల క్రితమే సంపాదించి సిద్ధంగా పెట్టుకున్నారు. ముందే బయటకు తీసి రాజకీయంగా పలచన చేయడం రేవంత్ రెడ్డికి ఎంత మాత్రం ఇష్టం లేదు. అయితే ఇప్పుడు పరిస్థితి చేయి దాటుతుండడంతోనే ఈ ఆస్తుల ప్రయోగం చేశారు. త్వరలో లగ్జరీ ఆస్తుల




వివరాలను కూడా బయట పెడతారని ప్రచారం జరుగుతోంది. ఇక్కడితో కథ ముగిసి పోలేదని.. ముమ్ముందు పరిణామాలు మరింత హాట్ గా ఉంటాయన్న టాక్ నడుస్తోంది.

**కేంద్ర పెద్దల ఆదేశాలు**

గడిచిన కొన్ని నెలలుగా గులాబీ పార్టీ తన రాజకీయాన్ని రెట్టింపు చేసింది. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డిని, ఆయన కుటుంబాన్ని టార్గెట్ చేస్తూ గులాబీ పార్టీ శ్రేణులు దాడుల తీవ్రతను విపరీతంగా పెంచేసాయి. సరిగ్గా ఇటువంటి సమయంలోనే ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ బహిరంగంగానే రేవంత్ కు ఒక పొలిటికల్ లీక్ ఇచ్చారు. మీలో మునుపటి ఫైర్ లేకుంటే మాత్రం కష్టం అన్నది తేల్చేశారు. దీంతో రేవంత్ కెసిఆర్ పై భూముల అస్త్రాన్ని ప్రయోగించారు. ఒక్క భూములు మాత్రమే కాదు.. తరువాత లగ్జరీ ఆస్తులు కూడా బయట పెట్టే ఛాన్స్ కనిపిస్తోంది.

**రేవంత్ రివర్స్ పంచ్..**

రేవంత్ రెడ్డి పాలనపై పూర్తిగా దృష్టిపెట్టారు. రాజకీయ దూకుడును తగ్గించారు. ఈ క్రమంలో గులాబీ పార్టీ నుంచి దాడుల తీవ్రత పెరిగింది. దాని గురించి రేవంత్ ఆరా తీయగా.. కేంద్ర పెద్దల నుంచి తెలంగాణ కీలక నేతకు వచ్చిన ఆదేశం అని తెలుసుకున్నారు. ఢిల్లీ పెద్దల ఆదేశాలతోనే గులాబీ పార్టీ నేతలు విమర్శల దాడి పెంచారు. రేవంత్ ను అవినీతి ఊబిలో దించితే అందరూ ఒకటే నన్న భావన తెలంగాణ సమాజంలో కల్పించేందుకు ఎత్తుగడవేశారు. విషయం తెలుసుకున్న రేవంత్ తిరిగి రివర్స్ అయ్యారు. గట్టిగానే తన రాజకీయాన్ని మొదలుపెట్టారు. ఇప్పుడు కెసిఆర్ కుటుంబమే సమాధానం చెప్పుకోవాల్సిన రక్షణాత్మక స్థితిలో నెట్టేశారు. రేవంత్ రెడ్డి ఇన్నాళ్లు రహస్యంగా దాచిపెట్టిన పాత ఆస్తుల బయట పెట్టేయడంతో గులాబీ పార్టీ నిద్రలేని రాత్రులు గడుపుతోంది. అయితే ఇప్పటివరకు భూములు మాత్రమే.. ముమ్ముందు మాత్రం లగ్జరీ ఆస్తుల వివరాలను సైతం బయటపెట్టేందుకు సరైన సమయం, వ్యూహంతో ఉన్నారు రేవంత్.



# అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్!

ఇప్పటికే 90 శాతం మంది వినియోగదారులు బయోమెట్రిక్ పూర్తి చేశారు దేశీయ వంటగ్యాస్ (ఎల్పీజీ) వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. రాయితీ ధరపై వంటగ్యాస్ సిలిండర్లను పొందేందుకు 2026 అక్టోబర్ 1 నాటికి బయోమెట్రిక్ ఆధార్ ప్రామాణీకరణ (బీఏఏ) ప్రక్రియను పూర్తి చేయడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. అర్హులైన కుటుంబాలకు మాత్రమే సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడటంతో పాటు, గృహ అవసరాల సిలిండర్లు వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు అక్రమంగా మళ్లకుండా నిరోధించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం వెల్లడించింది. ఆధార్‌తో బయోమెట్రిక్ అనుసంధానం చేయడం ద్వారా డూప్లికేట్, అనర్హమైన కనెక్షన్లను సులభంగా గుర్తించి తొలగించే అవకాశం ఉంటుందని పేర్కొంది. వినియోగదారులు వివిధ మార్గాల్లో ఈ బయోమెట్రిక్ ప్రక్రియను పూర్తి చేసే సౌలభ్యం ఉంది. సిలిండర్ డెలివరీ చేసే సమయంలో సిబ్బంది వద్ద ఉండే మొబైల్ యాప్ ద్వారా, లేదా నేరుగా సమీపంలోని గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కార్యాలయాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. వీటితో పాటు సంబంధిత ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల అధికారిక మొబైల్ యాప్‌ల (ఇండేన్‌కు ఇండియన్‌ఆయిల్ వన్, భారత్‌గ్యాస్‌కు హలోబీపీసీఎల్, హెచ్‌పీ గ్యాస్‌కు హెచ్‌పీ పే) ద్వారా కూడా వినియోగదారులు స్వయంగా ప్రామాణీకరణ చేసుకోవచ్చని ప్రభుత్వం సూచించింది. ఇప్పటికే బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తి చేసిన వారు మళ్లీ చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, నిర్ణీత గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయని పక్షంలో సబ్సిడీ వర్తించదు. అటువంటి వారు సిలిండర్‌ను మార్కెట్ ధరకే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 19 నాటికి దేశవ్యాప్తంగా దాదాపు 90 శాతం మంది, అంటే 27.43 కోట్ల మంది వినియోగదారులు ఇప్పటికే బయోమెట్రిక్ ప్రామాణీకరణను పూర్తి చేశారని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండర్‌పై సుమారు రూ. 210 వరకు రాయితీ లభిస్తోంది. కేవలం అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఈ ప్రయోజనం చేకూరేలా చూడటం ప్రభుత్వ ఆర్థిక సుస్థిరతకు అత్యవసరమని కేంద్ర ప్రభుత్వం తన ప్రకటనలో పేర్కొంది.

# మద్యం కుంభకోణంలో జగన్!



లిక్కర్ విధానంలో పాత రూల్స్ కు స్వస్తి పలికి.. డిజిటలైజేషన్ ను పక్కన పెట్టడం వెనుక భారీ వ్యూహం దాగి ఉందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. వైసిపి హయాంలో భారీ మద్యం కుంభకోణం జరిగిందని కూటమి ప్రభుత్వం అనుమానించింది. కేసులు నమోదు చేసి వరుసగా అరెస్టులు చేస్తోంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నోటీసులు జారీచేసింది. అయితే కీలకమైన విచారణ జరుగుతున్న సమయంలో.. లిక్కర్ అక్రమ రవాణా కేసులో a3 నిందితుడిగా ఉన్న సత్య ప్రసాద్ అప్రూవర్ గా మారేందుకు పిటీషన్ దాఖలు చేశాడు. అందుకు సిఐడి కోర్టు అనుమతించింది. ఈ నేపథ్యంలో కోర్టులో 164 స్టేట్మెంట్లో సత్యప్రసాద్ కీలక విషయాలను వెల్లడించారు.

**కీలక అంశాలు వెల్లడి..**

a3 నిందితుడిగా ఉన్న సత్యప్రసాద్ ఈ కేసుకు సంబంధించిన కీలక అంశాలను వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. గతంలో సిగేట్ అనే సంస్థ ద్వారా మద్యం విక్రయాలు జరిగేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ వ్యవస్థను రద్దు చేశారు. మాన్యువల్ విధానంలో విక్రయాలకు మార్గం సుగమం చేశారు. మద్యం అనుమతులు, లైసెన్సుల మంజూరు లో భారీ మొత్తం చెల్లింపులు జరిగాయి. ఎక్కువ మతాలు చెల్లించిన వారికి అనుకూలంగా అనుమతులు ఇచ్చారు. ఈ మొత్తం వ్యవహారం మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి తెలిసే జరిగింది. ఆయనతో జరిగిన మీటింగులకు కేసిరెడ్డి, వాసుదేవ రెడ్డి హాజరయ్యే వారు. విధాన రూపకల్పన నుంచి వసూళ్ల మార్గాలు, కలెక్షన్ల పంపిణీ వరకు సమస్తము వీరే దగ్గరుండి నడిపించారు. ఈ కుంభకోణంలో వీరిద్దరూ ప్రధాన సూత్రధారులు. ఈ వ్యవహారంలో సుమారు 3500 కోట్ల రూపాయల మేర ఆర్థిక లావాదేవీలు జరిగాయి. ఈ డబ్బులన్నీ తాడేపల్లి ప్యాలెస్ కు వెళ్లాయి.. అంటూ సత్య ప్రసాద్ కోర్టుకు స్టేట్మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇంకొందరు పేర్లు కూడా ప్రస్తావించినట్లు సమాచారం.

**ఈడీ సైతం..**

మద్యం కుంభకోణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ చేపట్టింది. తరువాత కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ రంగంలోకి దిగింది. ఈ డిసైతం కొన్ని అరెస్టులు జరిపింది. అయితే ఏకంగా ఒక నిందితుడు అప్రూవర్ గా మారి పూర్తిస్థాయి విషయాలను వెల్లడించడం విశేషం. అయితే ఈ కేసులో అంతిమ లబ్ధిదారుడు మాజీ సీఎం జగన్ అన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఏకంగా ఒక నిందితుడు అప్రూవర్ గా మారి ఈ విషయాలను నేరుగా కోర్టుకు తెలపడంతో.. న్యాయస్థానం కీలక ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉంది. ఇంకోవైపు ప్రత్యేక దర్యాప్తు బృందంతో పాటు ఈడి రంగంలోకి దిగి జగన్మోహన్ రెడ్డికి నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. విచారణకు పిలిచే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

# అనర్హత తీర్పుపై.. సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్

**హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్**

**తన అనర్హతను సవాల్ చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు**

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ తరపున పోటీ చేయడమే కారణం**

**ఇప్పటికే సుప్రీంలో కేవియట్ దాఖలు చేసిన ఇతర ఎమ్మెల్యేలు**



ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా తనపై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును దానం నాగేందర్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. శనివారం మధ్యాహ్నం ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్?పీ) దాఖలు చేశారు. బీఆర్ఎస్ తరపున గెలిచి, ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై శుక్రవారం హైకోర్టు అనర్హత వేటు వేసిన విషయం విదితమే. సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తీర్పునిచ్చింది. ఈ అనర్హత 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే వర్తిస్తుందని న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది. దానం నాగేందర్‌పై దాఖలైన అనర్హత పిటిషన్లను తిరస్కరిస్తూ గతంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది. ఈ తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లుగా పరిగణించాలని, తీర్పు ప్రతులను స్పీకర్ కార్యాలయానికి, ఎన్నికల సంఘానికి పంపాలని ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు, ఇదే వ్యవహారంలో బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అంశంపై తమ వాదనలు వినకుండా ఎలాంటి ఏకపక్ష నిర్ణయం తీసుకోవద్దని వారు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు.

# అండమాన్‌లో అల్పపీడనం..

ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి వర్ష సూచన వెలువడింది. ఉత్తర అండమాన్, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇది రానున్న రోజుల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని, దీని ప్రభావంతో కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విపత్తుల నిర్వహణ సంస్థ కథనం ప్రకారం, ప్రస్తుతం అండమాన్‌లో కేంద్రీకృతమైన ఈ అల్పపీడనం క్రమంగా బలపడనుంది. సోమవారం నాటికి ఇది వాయుగుండంగా, మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉంది. అనంతరం వాయవ్య దిశగా పయనించి, బుధవారం ఉదయానికి దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాలకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఈ అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో వాతావరణం మారనుంది. ఆదివారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై, పలుచోట్ల విస్తారంగా వర్షాలు పడతాయని తెలిపింది. ముఖ్యంగా సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు కోస్తాంధ్రలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో రానున్న ఐదు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తీరప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

# ఖైరతాబాద్‌లో గెలిచేదెవరు?

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఈ ఎన్నిక భారత రాష్ట్ర సమితికి కొత్త ఊపిరి పోస్తుందా? కాంగ్రెస్ పార్టీకి చిక్కులు తెస్తుందా? భారతీయ జనతా పార్టీకి కొత్త అవకాశం దక్కుతుందా? అన్న టాక్ నడుస్తోంది. ఇప్పుడు ఇదే హాట్ టాపిక్. గులాబీ పార్టీకి ఛాన్స్..: గులాబీ పార్టీకి ఇదో అరుదైన అవకాశం. పార్టీ పుంజుకుంటుందని నాయకత్వం చెబుతోంది. అందుకే అధికార కాంగ్రెస్పై పోరాడేందుకు ఇదో సువర్ణ అవకాశం. కానీ గ్రౌండ్ రియాలిటీ మాత్రం గులాబీ పార్టీకి పెను సవాల్ విసురుతోంది. గతంలో పక్కనే ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణం తర్వాత వచ్చిన ఉప ఎన్నికల్లో సెంటిమెంట్, సానుభూతి ఏమాత్రం పనిచేయలేదు. హైదరాబాద్ మహానగర పరిధిలో గ్రామీణ ప్రాంతాల తరహా సాంప్రదాయ రాజకీయాలు, సానుభూతి పవనాలు పనిచేయవు అన్న విషయం ఆ ఎన్నికతో తేలిపోయింది. వాస్తవానికి ఖైరతాబాద్ లో గులాబీ పార్టీ కంటే దానం నాగేందర్ బలం అధికం అన్నది విశ్లేషకుల మాట. అందుకే ఇక్కడ అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూలమైన వాతావరణం ఉంటుందన్నది ఒక అభిప్రాయం.

**సంస్థాగత బలం తక్కువ..**

ఖైరతాబాద్ నియోజకవర్గంలో గులాబీ పార్టీకి సంస్థాగత బలం తక్కువ. గత దశాబ్ద కాలంగా అక్కడ రాజకీయం మొత్తం దానం నాగేందర్ చుట్టూనే తిరిగింది. అక్కడ పార్టీ కంటూ ప్రత్యేక క్యాడర్ నిర్మాణం జరగలేదు. దానం నాగేందర్ కు నియోజకవర్గంలో ఉన్న బలమైన వ్యక్తిగత అనుచర గణం, స్థానిక బస్తీల్లో ఆయనకు ఉన్న వ్యక్తిగత పట్టు కాదనలేని వాస్తవం. దీనికి తోడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఖైరతాబాద్ లో సంప్రదాయ బద్దంగా ఉన్న పాత ఓటు బ్యాంక్, సంస్థాగత క్యాడర్ తోడవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో బలమైన లోకల్ క్యాడర్, సరైన అభ్యర్థి లేని బిఆర్ఎస్ కు.. దానం నాగేందర్ వ్యక్తిగత బలం, కాంగ్రెస్ ప్రభుత్వ యంత్రాంగాన్ని ఎదుర్కోవడం భారత రాష్ట్ర సమితికి చాలా కష్టం. ఈ బై పోల్ లో గులాబీ పార్టీ మరోసారి ఓడిపోతే మాత్రం ఆ పార్టీకి పూర్తి డ్యామేజ్ తప్పదు.

**అప్పట్లో ఓటమి..**

2004లో ఇదే దానం నాగేందర్ కాంగ్రెస్ టికెట్ దక్కకపోయేసరికి తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో వెంటనే టిడిపి ఎమ్మెల్యే పదవి పోటీ చేసి కాంగ్రెస్ లో చేరారు. ఉప ఎన్నిక రాగా.. మరోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ దానం నాగేందర్ తో అటువంటి ప్రయోగం చేసి విఫలం అయితే కాంగ్రెస్ ప్రభుత్వ మనుగడకే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. సుస్థిరతకు సైతం విఘాతం కలిగే ఛాన్స్ ఉంటుంది. తరువాత వచ్చే గ్రేటర్ ఎన్నికలపై కూడా ప్రభావం చూపుతుంది. అయితే ఈ రెండు పార్టీలకు ఇప్పుడు ఖైరతాబాద్ ఉప ఎన్నిక అనేది ఒక సవాల్. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# సొంత నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన..

**పిఠాపురంలో రూ. 1,500 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించనున్న పవన్ కళ్యాణ్**

**రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**

**రూ. 200 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, రూ. 80 కోట్లతో గొల్లప్రోలు వాటర్ వర్క్స్‌కు శ్రీకారం**

**మహిళా సంఘాలకు రూ. 120 కోట్ల రుణాలు, మత్స్యకారులకు ఆధునిక పరికరాల పంపిణీ**

**తాగునీటి పథకాలు, రోడ్ ఓవర్ బ్రిడ్జి వంటి కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన**

ఏపీ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ తన నియోజకవర్గ అభివృద్ధిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో, సుమారు రూ. 1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటించి పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.పర్యటనలో భాగంగా సోమవారం, రూ. 9.59 కోట్లతో ఆధునికీకరించిన నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని పవన్ కల్యాణ్ ప్రజలకు అంకితం చేయనున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పథకం ద్వారా చివరి గ్రామాలకు నీరు అందడం లేదన్న సమస్యకు ఈ ఆధునికీకరణతో పరిష్కారం లభించనుంది. దీని ద్వారా 52 ఆవాసాల్లోని సుమారు 97 వేల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీంతో పాటు, పిఠాపురం పట్టణంలో ఆహ్లాదకర వాతావరణం కోసం ఏర్పాటు చేసిన 'పీఠికాపుర వనం', చందుర్తి-తాటిపర్తి బీటీ రోడ్డును కూడా ఆయన ప్రారంభించనున్నారు.మంగళవారం నిర్వహించే బహిరంగ సభలో నియోజకవర్గ రూపురేఖలు మార్చే కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు.

# అకస్మాత్తుగా తెరపైకి ప్రదీప్ రెడ్డి

వచ్చి వివరణలు ఇస్తున్నారు. అది తన సొంత ఆస్తి అని.. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు కేవలం లీజుకు మాత్రమే ఇచ్చినట్లు చెబుతున్నారు. మరోవైపు ఫామ్ హౌస్ ప్రాంగణంలో ప్రధాన ద్వారం వద్ద ప్రదీప్ రెడ్డి పేరుతో ప్రత్యేక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.

**భారీ కాన్వాయ్ తో..**

కేటీఆర్ ఫామ్ హౌస్ పై కాంగ్రెస్ పార్టీ దండయాత్ర చేసింది. ప్రదీప్ రెడ్డి చేస్తున్న ప్రకటనలను అస్సలు పట్టించుకోలేదు. శనివారం పీసీసీ నేతలు, కార్యకర్తలు భారీ కాన్వాయ్ తో జన్వాడ యాత్ర చేపట్టారు. ఫామ్ హౌస్ వద్దకు చేరుకోగా పోలీసులు భారీ భారీ గేట్లు ఏర్పాటు చేసి బయట అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఫామ్ హౌస్ ను బయట నుంచే పరిశీలించిన కాంగ్రెస్ నేతలు సంచలన ఆరోపణలు చేశారు. ప్రదీప్ రెడ్డి స్వతంత్ర బిల్డర్ కాదని.. ఆయన ముమ్మాటికి కేటీఆర్ కు ప్రధాన బినామీ అని ఆరోపించారు. జన్వాడ ప్రాంతంలో నిబంధనలను తుంగలో తొక్కి నిర్మించిన ఈ ప్యాలెస్ వెనుక అసలు పెట్టుబడి ఎవరిదో ప్రజలందరికీ తెలుసని మండిపడ్డారు.

**గులాబీ పార్టీలో ఆందోళన..**

అయితే ఒక్కసారిగా ఫామ్ హౌస్ లపై కాంగ్రెస్ పార్టీ పడటంతో గులాబీ పార్టీలో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. గత కొంతకాలంగా జన్వాడ ఫామ్ హౌస్ అంటే కేటీఆర్ దేనని ప్రజల్లోకి బలంగా వెళ్ళింది. ఇప్పుడు చట్టపరమైన చిక్కులు, కూల్చివేతల భయంతో తప్పించుకునేందుకే ప్రదీప్ రెడ్డి ని ముందుంచి బుకాయిస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. ప్రదీప్ రెడ్డి కేవలం తెరపై కనిపించే పాత్రధారి మాత్రమేనని.. నిర్మాణ అనుమతులు, ఆర్థిక లావాదేవీలు, లీజు అగ్రిమెంట్ల వెనుక ఉన్న నగదు ప్రవాహాన్ని ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలిస్తోందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. చూడాలి ఎలాంటి చర్యలు ఉండబోతున్నాయో.

# విశాఖలో 28,445 కుటుంబాలకు వరం!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, విశాఖపట్నం:** విశాఖ మహానగరంలో నివాసం ఉంటున్న వేలాదిమంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు కూటమి ప్రభుత్వం గొప్ప వరం ప్రకటించింది. దశాబ్దాల నిరీక్షణకు సరైన ఫలితం లభించింది. ప్రభుత్వ స్థలాల్లో ఏళ్ల తరబడి ఇల్లు నిర్మించుకుని జీవిస్తున్న నిరుపేదలకు.. ఆ స్థలాలపై సంపూర్ణ యజమాన్య హక్కులు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. జీవో 296, 388 నిబంధనల ప్రకారం పెండింగ్లో ఉన్న ఆక్రమణలను క్రమబద్ధీకరించారు . శనివారం విశాఖ మహానగరంలో సీఎం వేలాదిమంది లబ్ధిదారులకు పూర్తి హక్కులతో కూడిన ఇళ్ల పట్టాల పంపిణీ పూర్తి చేశారు. నిజంగా ఇది గొప్ప విషయమే. దశాబ్దాలుగా తీవ్ర అభద్రతాభావంతో బతుకుతున్న నిరుపేదలు, మధ్యతరగతి వారికి కూటమి ప్రభుత్వం భరోసా ఇచ్చినట్లు అయింది.

**ఏకంగా 11 మండలాల్లో..**

కూటమి ప్రభుత్వం ఈ బృహత్తర క్రమబద్ధీకరణ పథకం ద్వారా.. విశాఖ జిల్లాలోని 11 మండలాల పరిధిలో 28,445 కుటుంబాలకు శాశ్వత భూ హక్కు లభించింది. మార్కెట్ విలువ ప్రకారం దాదాపు రూ.8,874 కోట్ల విలువైన 19,33, 853 చదరపు గజాల ప్రభుత్వ భూమిని అధికారులు క్షేత్రస్థాయి సర్వేల అనంతరం అధికారికంగా క్రమబద్ధీకరించారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు మారినా కాగితాలకే పరిమితమైన ఈ సమస్యను ప్రస్తుత ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించింది. ముఖ్యంగా 100 చదరపు గజాల లోపు నివాసం ఉంటున్న.. అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఉచితంగానే క్రమబద్ధీకరించి.. ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజుల భారం లేకుండా పట్టాలు అందించేందుకు విశాఖ జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది.

**దశాబ్దాలుగా ఎదురుచూపులు..**

దశాబ్దాలుగా వేలాది మంది మధ్యతరగతి ప్రజలు సొంతింటి హక్కు కోసం ఎదురుచూస్తూ వస్తున్నారు. ఇళ్ళ నిర్మాణం అయితే జరిపారు కానీ పూర్తి అభద్రతాభావంతో ఉంటూ వస్తున్నారు. ప్రపంచ స్థాయి నగరంగా రూపుదిద్దుకుంటున్న విశాఖలో సామాన్య, బడుగు బలహీన వర్గాలను విస్మరించకుండా.. నగర అభివృద్ధిలో వారిని సైతం సమాన భాగస్వామ్యులను చేయాలన్నదే తమ లక్ష్యం అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఒకవైపు నగరానికి అంతర్జాతీయ పెట్టుబడులు, పారిశ్రామిక ప్రాజెక్టులు, ఐటీ పరిశ్రమలను రప్పిస్తూనే.. మరోవైపు నిరుపేదలకు ఇళ్ల పట్టాలు, సంక్షేమ పథకాలు, మౌలిక వసతులను సమకూర్చుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమం కేవలం ఒక సాధారణ పట్టాల పంపిణీ మాత్రమే కాదని.. వేలాది కుటుంబాల జీవన భద్రతను శాశ్వతంగా స్థిరపరిచే ఆర్థిక సాధికారిత అని సీఎం స్పష్టం చేశారు.

# బొత్స కు బంపర్ ఆఫర్!

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో: సీనియర్ నేత బొత్స సత్యనారాయణకు జగన్మోహన్ రెడ్డి బంపర్ ఆఫర్ ఇచ్చారు. ఆయన కుటుంబ సభ్యులకు కోరినన్ని సీట్లు ఇచ్చేందుకు సమ్మతించారు. బొత్స మేనల్లుడు చిన్న శ్రీను పార్టీకి గుడ్ బై చెప్పిన నేపథ్యంలో.. విజయనగరం జిల్లాలో నష్ట నివారణకు దిగారు జగన్మోహన్ రెడ్డి. ఒకవేళ బొత్స గుడ్ బై చెప్తే ఉత్తరాంధ్ర పై పెను ప్రభావం చూపడం ఖాయం. ఆ నష్టం ఊహించలేనిది కూడా. అందుకే జగన్మోహన్ రెడ్డి బొత్స సత్యనారాయణ కు ఓపెన్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. పార్టీలో ఉండాలని.. సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. తక్షణం భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా బొత్స సత్యనారాయణ కుమార్తె డాక్టర్ బొత్స అనూషను నియమించారు. దీంతో బొత్స పార్టీ నుంచి చేజారకుండా జగన్మోహన్ రెడ్డి కొంత అడ్డుకట్ట వేయగలిగారు.

**గతం కంటే ఎక్కువగా..**

గతం కంటే ఎక్కువగా బొత్స ఫ్యామిలీకి టికెట్లు ఇచ్చేందుకు జగన్ అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. గతంలో బొత్స చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసేవారు. ఆయన తమ్ముడు అప్పల నరసయ్య గజపతినగరం నుంచి.. మరో సమీప బంధువు బడ్డుకొండ అప్పలనాయుడు నెల్లిమర్ల నుంచి బరిలో దిగేవారు. బొత్స ఝాన్సీ లక్ష్మి జిల్లా పరిషత్ చైర్మన్ గాను.. తరువాత మేనల్లుడు చిన్న శ్రీను ఆ పదవికి ఎంపికయ్యారు. విజయనగరం ఎంపీగా కూడా బొత్స ఝాన్సీ లక్ష్మీ వ్యవహరించారు. చిన్న శ్రీను బయటకు వెళ్లిపోవడంతో ఆ కుటుంబంలో అడ్డగోలుగా చీలిక వచ్చింది. అయినా సరే బొత్స ఫ్యామిలీకి పూర్తిస్థాయిలో టిక్కెట్లు ఇచ్చేందుకు జగన్ అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది.


**అప్పట్లో చాలా ఇబ్బందులు..**

2014 ఎన్నికల్లో బొత్స ఫ్యామిలీ కాంగ్రెస్ పార్టీలో ఉండిపోయింది. ఆ సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దిక్కు లేకుండా పోయింది విజయనగరంలో. ఆ ప్రభావం ఉత్తరాంధ్ర పై కూడా చూపింది. అందుకే 2019 ఎన్నికలకు ముందు బొత్స ఫ్యామిలీని ప్రత్యేకంగా రప్పించుకున్నారు జగన్. ఆ ఫ్యామిలీకి నాలుగు టికెట్లు ఇచ్చారు. బొత్సను అయిదేళ్లపాటు మంత్రిగా కొనసాగించారు. అయితే చిన్న శ్రీను పార్టీ నుంచి వెళ్లిపోగా.. బడ్డుకొండ అప్పలనాయుడు సైతం పార్టీ నుంచి బయటకు వెళ్లిపోతారని ప్రచారం నడుస్తోంది. మరోవైపు బొత్స సైతం జంప్ చేయక తప్పదు అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో కూడా ఆ రకమైన అనుమానం పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో జగన్ బొత్స సత్యనారాయణ ను పిలిపించుకుని మాట్లాడారు. ఆ కుటుంబానికి ఓపెన్ ఆఫర్ ఇచ్చినట్లు ప్రచారం నడుస్తోంది.

**వారందరినీ కాదని..**

విశాఖ జిల్లాలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ లాంటి నేతలు ఉండగా.. భీమిలి నియోజకవర్గ ఇన్చార్జిగా బొత్స కుమార్తె డాక్టర్ అనూషను ప్రకటించారు జగన్. బొత్స యధావిధిగా చీపురుపల్లి నుంచి బరిలో దిగనున్నారు. బొత్స ఝాన్సీ లక్ష్మికి తిరిగి విశాఖ పార్లమెంట్ సీటు ఇవ్వనున్నారు. బొత్స అప్పల నరసయ్య గజపతినగరం నుంచి మరోసారి పోటీకి దిగుతారు. ఇంకోవైపు బొత్స కుమారుడు డాక్టర్ సందీప్ నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం ఉంది. ఇలా ఆ కుటుంబంలో ఐదుగురికి టికెట్లు ఇచ్చేందుకు జగన్ అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. కేవలం బొత్స పార్టీ నుంచి బయటకు వెళ్లిపోతారన్న ప్రచారం నేపథ్యంలోనే జగన్మోహన్ రెడ్డి జాగ్రత్త పడినట్లు సమాచారం. అయితే చిన్న శ్రీను రూపంలో బలమైన శక్తి వెళ్ళిపోయిన నేపథ్యంలో.. జగన్ ప్రయత్నాలు ఎంతవరకు ఫలిస్తాయి అనేది చూడాలి.

# భీమిలిపై గుడివాడ కన్ను!



**క్రైమ్ మిర్రర్, విశాఖపట్నం:** ఉత్తరాంధ్ర రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కీలక నాయకుడు, విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పార్టీకి గుడ్ బై చెప్పి టీడీపీలో చేరిపోయారు. విజయనగరం వైయస్సార్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవితో పాటు విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గ బాధ్యతల నుంచి ఆయన తప్పుకున్నారు. అయితే ఇప్పుడు భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్ పోస్ట్ కోసం మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ గట్టి ప్రయత్నమే చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన చోడవరం వైసీపీ ఇన్చార్జిగా ఉన్నారు. అయిష్టంగానే ఆ పదవిలో కొనసాగుతూ వస్తున్నారు. ఇప్పుడు భీమిలి ఖాళీ కావడంతో ఆ స్థానాన్ని కోరుకుంటున్నారు.

**అవంతి పార్టీ మారడంతో..**

మొన్నటి ఎన్నికల్లో భీమిలి నుంచి పోటీ చేశారు మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు. కానీ టిడిపి అభ్యర్థి గంటా చేతిలో ఓడిపోయారు. ఫలితాలు వచ్చిన తర్వాత వైసీపీకి గుడ్ బై చెప్పారు. దీంతో ఇక్కడ తక్షణ దిద్దుబాటు చర్యలను నిమిత్తం విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ గా ఉన్న మజ్జి శ్రీనివాసరావుకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారు జగన్. వచ్చే ఎన్నికల్లో విశాఖ పార్లమెంట్ స్థానం నుంచి బొత్స ఝాన్సీ లక్ష్మి మరోసారి బరిలో దిగుతారని.. భీమిలి నుంచి మజ్జి శ్రీనివాసరావు రంగంలో ఉంటారని అంతా భావించారు. కానీ ఆయన వైసీపీకి గుడ్ బై చెప్పారు. తన కుమార్తెతో కలిసి టీడీపీలో చేరిపోయారు. దీంతో భీమిలి నియోజకవర్గం ఖాళీ అయింది. అక్కడకు వెళ్లేందుకు మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అధినేత జగన్మోహన్ రెడ్డికి కూడా ప్రత్యేక విజ్ఞప్తి చేశారు.

**చివరి నిమిషంలో గాజువాకకు..**

గత అసెంబ్లీ ఎన్నికల్లో గాజువాక నుంచి బరిలో దిగారు గుడివాడ అమర్నాథ్. 2019 ఎన్నికల్లో అనకాపల్లి నుంచి గెలిచిన అమర్నాథ్ మంత్రి కూడా అయ్యారు. మరోసారి అదే నియోజకవర్గంలో నుంచి పోటీ చేయాలని భావించారు. కానీ జగన్మోహన్ రెడ్డి ఆయనకు అవకాశం ఇవ్వలేదు. చివరి నిమిషంలో గాజువాక నుంచి పోటీ చేసే అవకాశం కల్పించారు. కానీ అక్కడ రికార్డు స్థాయి ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆయనపై పల్లా శ్రీనివాసరావు 90000 ఓట్లకు పైగా మెజారిటీతో విజయం సాధించారు. రాష్ట్రంలోనే ఇదే అత్యధిక మెజారిటీ. ఎన్నికల ఫలితాల తర్వాత చోడవరం నియోజకవర్గ బాధ్యతలు గుడివాడ అమర్నాథ్ కేటాయించారు. అక్కడ ఇన్చార్జిగా ఉన్న ధర్మ శ్రీ కి అనకాపల్లి పార్లమెంట్ బాధ్యతలు కట్టబెట్టారు.

**రాజకీయంగా పట్టు కోసం..**

ఇప్పుడు భీమిలి ఖాళీ కావడంతో గుడివాడ అమర్నాథ్ అక్కడకు వచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. సజ్జల రామకృష్ణారెడ్డి ద్వారా ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. భీమిలి నియోజకవర్గానికి ప్రత్యేక రాజకీయ, భూగోళ ప్రాధాన్యతలు ఉన్నాయి. విశాఖ మహానగరానికి చెంతనే ఉండడం.. కాపు సామాజిక వర్గం అధికంగా ఉండడంతో.. అదే సామాజిక వర్గానికి చెందిన గుడివాడ అమర్నాథ్ రాజకీయ పట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే జగన్మోహన్ రెడ్డి మాత్రం స్థానిక నాయకత్వానికి ప్రోత్సాహం అందించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్థికంగా, సామాజికపరంగా మంచి ప్రభావం చూపగలిగిన నేతకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. చూడాలి చివరికి ఏం జరుగుతుందో..జస్త్ర

# వైసీపీకి కోలుకోలేని దెబ్బ!

(మొదటి పేజీ తరువాయి)

కొత్త పార్టీని ప్రకటించనున్నారు. అంతకుముందే కొత్త పార్టీకి సంబంధించి సన్నాహాలు మొదలుపెట్టారు. కీలక వ్యాఖ్యలు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఆయన అజెండా స్పష్టంగా తెలుస్తోంది. మతమార్పిడులు, రెడ్డి సామాజిక వర్గం, హిందుత్వవాదం వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. ఈ రాష్ట్రానికి కమ్మ, రెడ్డి సామాజిక వర్గం వారే పాలించాలా? ఇతరులు పాలించకూడదా అన్నట్టు ఆయన మాట్లాడారు. అక్కడితో ఆగకుండా తన పార్టీ అధికారంలోకి వస్తే తాను సీఎం కానని.. ఇతరులను కూర్చోబెడతానని కూడా ప్రకటించారు. మరోవైపు బలమైన హిందుత్వ వాదాన్ని తెరపైకి తెస్తూ.. మతమార్పిడిల అంశాన్ని తెరపైకి తేవడం వెనుక బలమైన వ్యూహం ఉన్నట్లు అర్థం అవుతుంది. ప్రధానంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని డ్యామేజ్ చేసే ప్రయత్నం గా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**ఎక్కువగా మతమార్పిడులు..**

వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో పెద్ద ఎత్తున మతమార్పిడులు జరిగాయి అని ఆరోపిస్తున్నారు విజయసాయిరెడ్డి. వైసీపీ ప్రభుత్వంలో పదవులు దక్కాలంటే తప్పకుండా మతం మార్చాల్సిందేనన్న ఆదేశాలు ఉండేవని గుర్తు చేస్తున్నారు. చాలామంది పదవులు దక్కడం వెనుక మతమార్పిడి అంశం ఉంది అంటూ సంచలన విషయాలను బయటపెట్టారు విజయసాయిరెడ్డి. వైసిపి హయాంలో అన్యమత ప్రచారం, తిరుమల కొండపై కూడా ఇతర మతాల ప్రచారం సాగిందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా క్రిస్టియానిటీని జగన్మోహన్ రెడ్డి ప్రోత్సహించారని స్వయంగా విజయసాయిరెడ్డి చెప్పుకొచ్చారు. అందుకు సంబంధించిన వీడియోలను సైతం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తద్వారా మతమార్పిడిల విషయంలో వైసీపీని కార్నర్ చేశారు.

**బలమైన హిందుత్వవాదం..**

బలమైన హిందుత్వ వాదాన్ని వినిపిస్తున్నారు విజయసాయిరెడ్డి. ఉత్తరాదిలో వినిపించే లవ్ జిహాద్ మొన్న మధ్యన విజయసాయిరెడ్డి నోటి నుంచి వచ్చింది. ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య చేసుకున్న క్రమంలో ఆ వ్యాఖ్యలు చేశారు. తద్వారా తాను బలమైన హిందుత్వవాదిగా.. త్వరలో తాను ఏర్పాటు చేయబోయే పార్టీ హిందూ అనుకూల పార్టీ అని చెప్పకనే చెప్పారు. ఆపై వైసీపీ హిందూ వ్యతిరేక ముద్ర మూటగట్టుకుంది. దానిని మరింత హైలెట్ చేసే ప్రయత్నంలో భాగంగా విజయసాయిరెడ్డి హిందుత్వ వాదాన్ని తీసుకున్నారు అనేది ప్రధాన వాదన.

**రెడ్డి సామాజిక వర్గానికి అన్యాయం అంటూ..**

మరోవైపు రెడ్డి సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసుకుంటున్నారు విజయసాయిరెడ్డి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తూ వస్తోంది ఆ సామాజిక వర్గం. ఇప్పుడు అసలైన రెడ్డి సామాజిక వర్గం ఇబ్బంది పడుతోందని.. కన్వర్టెడ్ క్రిస్టియన్ రెడ్డి సామాజిక వర్గం మాత్రమే బాగుపడుతోంది అన్న ఆరోపణలు చేస్తున్నారు. అసలైన రెడ్డి సామాజిక వర్గానికి వైసీపీ అన్యాయం చేసిందన్నట్టు మాట్లాడుతున్నారు. తాను పెట్టబోయే పార్టీలో అసలైన రెడ్డి సామాజిక వర్గానికి సముచిత స్థానం ఉంటుందని కూడా చెబుతున్నారు. ఇప్పటికే వైసీపీలో అసంతృప్తిగా ఉన్న రెడ్డి సామాజిక వర్గం నేతలకు టచ్ లోకి వెళ్తున్నారు. వారిని తన వైపునకు తిప్పుకునేందుకు ఆయన గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో కొంత వర్కౌట్ అయినట్లు కూడా తెలుస్తోంది. ఈ మూడు అంశాలతో వైసిపిని దారుణంగా దెబ్బతీయాలని భావిస్తున్నారు విజయసాయిరెడ్డి. చూడాలి ఇందులో ఎంతవరకు సక్సెస్ అవుతారో..

# జపాన్‌లో 20వ ఆసియా క్రీడలు అట్టహాసంగా ప్రారంభం..

**భారత అథ్లెట్లకు ప్రధాని మోదీ విషెస్**

**జపాన్‌లోని ఐచీ-నగోయాలో 20వ ఆసియా క్రీడలు ఘనంగా ప్రారంభం**


**భారత క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని నరేంద్ర మోదీ**

**ప్రారంభోత్సవంలో పతాకధారులుగా షూటర్ మను భాకర్, కబడ్డీ స్టార్ పవన్ సెహ్రావత్**

**గత ప్రదర్శనను అధిగమించి మరిన్ని పతకాలు గెలవాలనే లక్ష్యంతో భారత్**

**క్రికెట్, కబడ్డీ, హాకీలో టైటిళ్లను నిలబెట్టుకోవాలని చూస్తున్న టీమిండియా**

ఆసియా ఖండంలోనే అతిపెద్ద క్రీడా సంబరం మొదలైంది. జపాన్‌లోని ఐచీ-నగోయా నగరాలు వేదికగా 20వ ఆసియా క్రీడలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన అట్టహాస వేడుకలో జపాన్ చక్రవర్తి నరుహిటో ఈ క్రీడలను అధికారికంగా ప్రారంభించినట్లు ప్రకటించారు. రాబోయే రెండు వారాల పాటు వేలాది మంది క్రీడాకారులు పతకాల కోసం పోటీ పడనున్నారు. ఈ చారిత్రాత్మక ఈవెంట్ సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, దేశ క్రీడా బృందానికి తన శుభాకాంక్షలు తెలిపారు. “ఐచీ-నగోయాలో ఆసియా క్రీడలు ప్రారంభమవుతున్న వేళ, భారత బృందానికి నా శుభాకాంక్షలు. ప్రతి క్రీడాకారుడు అద్భుతమైన కృషి, అంకితభావం, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించారు. వారిని చూసి భారతదేశం గర్విస్తోంది. వారు తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలి, బాగా ఆడాలి, ప్రకాశించాలి!” అని ప్రధాని ‘ఎక్స్’ వేదికగా పోస్ట్ చేశారు. ప్రారంభోత్సవ వేడుక భారత్‌కు ఎంతో ప్రత్యేకంగా నిలిచింది. ఒలింపిక్ పతక విజేత, షూటర్ మను భాకర్, కబడ్డీ స్టార్ పవన్ సెహ్రావత్ భారత బృందానికి పతాకధారులుగా ముందుండి నడిపించారు. త్రివర్ణ పతాకాన్ని చేతబూని స్టేడియంలోకి అడుగుపెట్టిన వీరిపై దేశం భారీ అంచనాలు పెట్టుకుంది. 2023లో హాంగ్‌జౌలో జరిగిన గత ఆసియా క్రీడల్లో 28 స్వర్ణాలతో సహా మొత్తం 107 పతకాలు సాధించి భారత్ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఈసారి ఆ రికార్డును అధిగమించాలనే లక్ష్యంతో భారత బృందం బరిలోకి దిగుతోంది.ఆసియా క్రీడలకు జపాన్ ఆతిథ్యం ఇవ్వడం ఇది మూడోసారి. గతంలో 1958లో టోక్యోలో, 1994లో హిరోషిమాలో ఈ పోటీలు జరిగాయి. ఈసారి 45 దేశాలకు చెందిన క్రీడాకారులు 43 క్రీడాంశాల్లో తలపడనున్నారు.ఈ పోటీల్లో భారత్ పలు క్రీడల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. పురుషుల, మహిళల క్రికెట్, కబడ్డీ జట్లతో పాటు, పురుషుల హాకీ జట్టు కూడా తమ టైటిళ్లను నిలబెట్టుకోవాలని చూస్తోంది. బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు, వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను భారత ప్రచారానికి నాయకత్వం వహించనున్నారు. షూటింగ్‌లో మను భాకర్, రెజ్లింగ్‌లో అమన్ సెహ్రావత్, బాక్సింగ్‌లో లవ్లీనా బోర్గోహెన్ వంటి ప్రముఖులు పతకాలపై కన్నేశారు. అథ్లెటిక్స్‌లో 75 మందికి పైగా భారత క్రీడాకారులు బరిలో ఉన్నారు. గుల్వీర్ సింగ్, తేజస్విన్ శంకర్, జ్యోతి యర్రాజీ, పారుల్ చౌదరి వంటి అథ్లెట్లు తమ సత్తా చాటడానికి సిద్ధమయ్యారు. షాట్‌పుట్‌లో తజిందర్‌పాల్ సింగ్ తూర్ వరుసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచి, ఈసారి కూడా ఫేవరెట్‌గా పోటీ పడుతున్నాడు.



# మెగా జాబ్ మేళా.. కోదాడకు పోటెత్తిన యువత

**ఉద్యోగాలకు 5,620 మంది షార్ట్‌లిస్ట్**

**3,500 మందికి పైగా కొలువులు దక్కే అవకాశం**

**350 కంపెనీలు.. 32 వేల మందికి పైగా నమోదు**

**తొలి రెండు గంటల్లోనే 700 మందికి ఉద్యోగాలు**





**కోదాడ, సెప్టెంబర్ 19 ( క్రైమ్ మిర్రర్ ):** కోదాడ : అన్ని దారులూ కోదాడ వైపే అన్నట్లుగా శనివారం వేలాది మంది యువత మెగా జాబ్ మేళాకు తరలివచ్చారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి భారీ సంఖ్యలో వచ్చిన ఉద్యోగార్థులతో కోదాడ పట్టణం కిక్కిరిసిపోయింది. వివిధ రంగాలకు చెందిన కంపెనీలు మొత్తం 5,620 మంది అభ్యర్థులను ఉద్యోగాలకు షార్ట్‌లిస్ట్ చేశాయి. వీరిలో 3,500 మందికి పైగా ఉద్యోగాలు దక్కే అవకాశం ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. జాబ్ మేళాకు ముందుగానే 22 వేల మందికి పైగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా, కార్యక్రమ ప్రాంగణంలో మరో 10 వేల మందికి పైగా పేర్లు నమోదు చేసుకున్నారు. దీంతో మొత్తం రిజిస్ట్రేషన్ల సంఖ్య 32 వేలు దాటింది. ఈ అపూర్వ స్పందనతో గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన తెలంగాణలోని అతిపెద్ద నియామక కార్యక్రమాల్లో ఒకటిగా కోదాడ మెగా జాబ్ మేళా నిలిచింది. జాబ్ మేళా ప్రారంభమైన తొలి రెండు గంటల్లోనే 700 మందికి పైగా యువత ఉద్యోగాలు సాధించారు. ఇంటర్వ్యూలు, స్క్రీనింగ్ పరీక్షలు పూర్తయిన వెంటనే పలువురు అభ్యర్థులకు కంపెనీల ప్రతినిధులు నియామక పత్రాలు అందజేశారు. సమాచార సాంకేతికత, ఫార్మా, తయారీ, విమానయానం, మౌలిక సదుపాయాలు, వైద్యం, బ్యాంకింగ్, రిటైల్ తదితర రంగాలకు చెందిన సుమారు 350 కంపెనీలు ఈ భారీ నియామక కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఫాక్స్‌కాన్, ఎల్‌అండ్‌టీ, ఎంఐఏఎల్, మహీంద్రా, టాటా, అరవింద్, ఎంఎస్ఎన్, మెట్రో, గూగుల్, ఇండిగో, అపోలో, మెడ్‌ప్లస్‌తోపాటు అనేక ప్రముఖ, వర్ధమాన సంస్థలు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకొచ్చాయి. ఉద్యోగార్థులు తమకు అందుబాటులో ఉన్న అవకాశాలను సులభంగా గుర్తించేందుకు జాబ్ మేళా ప్రాంగణంతోపాటు అధికారిక వెబ్‌సైట్‌లోనూ పాల్గొన్న కంపెనీల లోగోలను ప్రదర్శించారు. ఎల్‌అండ్‌టీ సంస్థ ఒక్కటే 40 మంది యువకులను ఎంపిక చేసి, సగటున నెలకు రూ.21 వేల వేతనం అందించనున్నట్లు తెలిపింది. ఇతర కంపెనీల ప్రతినిధులు కూడా రోజంతా ఇంటర్వ్యూలు నిర్వహించి సాంకేతిక, సాంకేతికేతర ఉద్యోగాలకు అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేశారు. విమానయానం, అనుబంధ సేవల్లో ఉద్యోగాలు కోరుకునే యువత ఉపాధి సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ ప్రాంతంలో పెద్దఎత్తున నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఇండిగో సంస్థ ప్రతినిధులు సూచించారు. తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి జాబ్ మేళాను సందర్శించారు. కంపెనీల ప్రతినిధులు, ఉద్యోగార్థులు, ఎంపికైన అభ్యర్థులతో మాట్లాడారు. ఉద్యోగాలు సాధించిన యువతకు నియామక పత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు వారి సొంత ప్రాంతానికి దగ్గరలోనే ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముందుకొచ్చిన కంపెనీలను ప్రశంసించారు. నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, మెగా జాబ్ మేళాకు వచ్చిన అపూర్వ స్పందన తెలంగాణ గ్రామీణ యువత ఆకాంక్షలకు, వారిలోని అపార సామర్థ్యానికి నిదర్శనమన్నారు. అర్హత కలిగిన ఉద్యోగార్థులు, ప్రముఖ కంపెనీల మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, ఉద్యోగ అవకాశాలను యువత ఇంటి ముంగిటకే తీసుకురావాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఉదయం నుంచే జాబ్ మేళా ప్రాంగణం యువతతో కిక్కిరిసిపోయింది. అభ్యర్థులు తమ అర్హతలకు అనుగుణమైన కంపెనీల స్టాళ్లను సందర్శిస్తూ స్క్రీనింగ్ పరీక్షలు, సాంకేతిక పరీక్షలు, వ్యక్తిగత ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఒకే అభ్యర్థి పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను పరిశీలించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ రంగాలకు సంబంధించిన ఎంపిక, షార్ట్‌లిస్టింగ్ ప్రక్రియ రోజంతా కొనసాగింది. కంపెనీలు ధ్రువీకరణ ప్రక్రియను పూర్తిచేసిన తర్వాత ఉద్యోగాలు పొందే అభ్యర్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.



## జీకేజీ గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం...

క్రైమ్ మిర్రర్ మాదాపూర్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని గుట్టల బేగంపేట్ లో జీకేజీ గణేష్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ అన్నదానంలో స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. నిరుపేదలకు, వృద్ధులకు కడుపునిండా భోజనం పెట్టడం ఎంతో సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో జీకేజీ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్, సభ్యులు, స్థానిక నాయకులు, యువకులు పాల్గొన్నారు. సహకరించిన అందరికీ కృతజ్ఞతలు చెప్పారు.

## గణేష్ మండపం వద్ద ఘనంగా అన్నదాన కార్యక్రమం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** సీపీఐ రాజేంద్రనగర్ మండల కార్యాలయం సమీపంలో బస్తీ వాసులు ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద మీసాల బ్రదర్స్ జె. విజయ్ ఆనంద్ గౌడ్, జె. సదానంద్ గౌడ్, జె. ఆనంద్ గౌడ్‌ల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహారెడ్డి, సీపీఐ మండల కార్యాలయ కార్యదర్శి జి. సత్యం, కాటేదాన్ శాఖ కార్యదర్శి శ్రీరాములు, రాత్లావత్ బిక్షపతి నాయక్, కె. మధు, శీను తదితర నాయకులతో పాటు యువత, బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు నిర్వాహకులు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన మీసాల బ్రదర్స్‌తో పాటు సీపీఐ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహారెడ్డిని గణేష్ మండపం యువత శాలువాతో సత్కరించారు. ప్రజలంతా ఐక్యంగా పండుగలను నిర్వహిస్తూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

## అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించిన లిటిల్ కడిల్స్ ప్రీ స్కూల్ చిన్నారులు





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగి మున్సిపల్ సర్కిల్ పరిధిలోని నెక్నంపూర్ డివిజన్ పుప్పలగూడ బాలాజీనగర్‌లో ఉన్న లిటిల్ కడిల్స్ ఇంటర్నేషనల్ ప్రీ స్కూల్ చిన్నారులు అవగాహన కార్యక్రమంలో భాగంగా లంగర్‌హౌస్ అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించారు. ఈ విద్యా క్షేత్ర పర్యటనలో భాగంగా అగ్నిమాపక సిబ్బంది సమాజ రక్షణలో పోషిస్తున్న కీలక పాత్రను, అత్యవసర సమయాల్లో వారు చేపట్టే సేవలను చిన్నారులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలు, ఫైర్ ఇంజిన్ పనితీరు, అత్యవసర సేవల ప్రాధాన్యతను సిబ్బంది చిన్నారులకు సులభమైన రీతిలో వివరించారు. పిల్లల పట్ల ఎంతో ఓపికగా వ్యవహరిస్తూ, ఫైర్ ఇంజిన్‌లోని పరికరాలను చూపిస్తూ వాటి వినియోగం గురించి వివరించడం చిన్నారుల్లో ఆసక్తిని పెంచింది. చిన్న వయసులోనే అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు ఫైర్ స్టేషన్ సిబ్బంది చేసిన చొరవను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా లంగర్‌హౌస్ ఫైర్ స్టేషన్ అధికారి సంతోష్ కుమార్‌తో పాటు మహేష్, తాహిర్ అలీ ఖాన్, కోమల్, కమలేశ, విజయ్, రవి తదితర సిబ్బందికి పాఠశాల ప్రిన్సిపాల్ హర్షిత సక్సేనా, యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన రంగారెడ్డి డి సి సి ప్రధాన కార్యదర్శి రెడ్డిగళ్ల అజయ్

**సొంత గ్రామంలో బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి**



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా డి సి సి ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా రెడ్డిగళ్ల అజయ్ తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనరసింహను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ గ్రామంలో బస్తీ దవాఖాన ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. గ్రామంలోని పేద ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా బస్తీ దవాఖాన మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ డివిజన్ ఐ ఎన్ టి యు సి జనరల్ సెక్రటరీ అభిషేక్ పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి నియామకం



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డిని నియమిస్తూ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీ కేసి వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా నా సేవలను గుర్తించి ఈ మహత్తర బాధ్యతను అప్పగించిన ఏఐసిసి జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, కే.సి. వేణుగోపాల్, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, చల్లా వంశీ చంద్ రెడ్డి, జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వేం నరేందర్ రెడ్డి, మరియు పార్టీ అధిష్టానానికి పారిజాత నరసింహారెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ అవకాశం ఇచ్చిన పార్టీకి ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటు, రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నా వంతు పూర్తి కృషి చేస్తానని, ఈ ప్రయాణంలో నాకు సహకరిస్తున్న జిల్లా నాయకులు, కార్యకర్తలు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు.

## హరిబాబు హత్య కేసులో పురోగతి.. బావమరిది సంతోష్ అరెస్ట్

నిజామాబాద్‌లో సంచలనం సృష్టించిన చిత్తరి హరిబాబు హత్య కేసు నిందితుడు, యూట్యూబర్ వైష్ణవి సోదరుడు గంధం సంతోష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు విశాఖపట్నం పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన హరిబాబు, మాదాపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే, కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 16న హరిబాబు తన భార్య వైష్ణవిని హత్య చేశాడు. ఈ కేసులో హరిబాబు, అతడి తల్లి, ఇద్దరు సోదరులు జైలుకు వెళ్లి ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చారు. అప్పటి నుంచి హరిబాబు తల్లి నిజామాబాద్‌లోని సాయినగర్‌లో అద్దె ఇంట్లో ఉంటోంది. నెల రోజుల క్రితం జైలు నుంచి వచ్చిన హరిబాబు, తన తల్లిని చూసేందుకు ఈ నెల 17న నిజామాబాద్ వచ్చాడు. ఇదే అదునుగా భావించిన వైష్ణవి అన్న సంతోష్, హరిబాబుపై కత్తితో దాడి చేసి హతమార్చి కారులో పరారయ్యాడు. అనంతరం ఈ హత్యను తానే చేశానని, తన చెల్లెలి హత్యకు ప్రతీకారంగా హరిబాబును అంతమొందించానని నిందితుడు సంతోష్ అదే రోజు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితుడి కోసం 4 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. శనివారం నిజామాబాద్ బైపాస్ వద్ద రైల్వే స్టేషన్‌కు వెళుతుండగా సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ హత్యకు సంతోష్ తల్లి రాణి, పెద్దమ్మ కుమారులు చరణ్, రంజిత్ ప్రోత్సహించారని, వారు ప్రస్తుతం పరారీలో ఉన్నారని సీపీ తెలిపారు. వారి కోసం గాలిస్తున్నామని, అరెస్ట్ చేసిన సంతోష్‌ను రిమాండ్‌కు తరలిస్తామని ఆయన వివరించారు.



## కందుకూరులో జై భవాని వైన్స్ షాపు దగ్ధం .. భారీ ఆస్తి నష్టం..!

**మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది...!**



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని కందుకూరు మండల కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. కందుకూరు మండల కేంద్రంలోని జై భవాని వైన్స్ లో శనివారం ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా...సమాచారం అందుకున్న కందుకూరు పోలీసులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే మంటల ధాటికి వైన్ షాప్ లోని మద్యం బాటిళ్లు, ఇతర సామాగ్రి పూర్తిగా దగ్ధమైందని తెలుస్తోంది. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం. అసలు నష్టం ఎంత అనేది అధికారుల పరిశీలన అనంతరం తెలియనుంది. బాధిత వైన్స్ షాపు షాద్ నగర్ కు చెందిన నవీన్ కు చెందినదిగా గుర్తించారు .అగ్ని ప్రమాదానికి అసలు కారణమేంటి? నిజంగా షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందా? వైన్స్ లో ఎంత మేర నష్టం వాటిల్లింది? అనే అంశాలపై కందుకూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రూపాయలు 6 కోట్ల విలువైన పార్కు స్థలం ఆక్రమణలు కూల్చివేత.

గండిపేట్, (క్రైమ్ మిర్రర్): నార్సింగి సర్కిల్ పరిధిలోని నేక్నంపూర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో అక్రమంగా నిర్మించిన కమర్షియల్ షెటర్లను శనివారం టౌన్ ప్లానింగ్ అధికారులు నేలమట్టం చేశారు. అధికారుల కథనం ప్రకారం సర్వే సంఖ్య 22 నుంచి 26 పరిధిలోని పార్కుకు సంబంధించిన 400 గజాల స్థలాన్ని ఒక వ్యక్తి ఆక్రమించి ఎనిమిది కమర్షియల్ షెటర్లు నిర్మించారు. సుమారు 6 కోట్ల రూపాయల విలువైన ఈ స్థలంలో షెటర్లను అద్దెకు ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఫిర్యాదులు రావడంతో అధికారులు స్పందించారు. ఏసిపి ప్రసీద, టిపిఎస్ రమేష్, ఆధ్వర్యంలో జెసిబిలతో టౌన్ ప్లానింగ్ సిబ్బందిఈ ఆక్రమణలను తొలగించారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.



# రైతులకు తెల్ల కుసుమ విత్తనాల పంపిణీ

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: ఎమ్మెల్యే కాలే యాదయ్య

## శంకర్ పల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాలకు చెందిన రైతులకు స్థానిక శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య తెల్ల కుసుమ విత్తనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాలకు చెందిన రైతులకు తెల్ల కుసుమ విత్తనాలను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించుకుని మంచి దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు.రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సదుపాయాలను అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సందర్భంగా శంకర్‌పల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల నియోజకవర్గంలోని రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.రైతు అభివృద్ధి -- వ్యవసాయ అభివృద్ధి --




గ్రామీణాభివృద్ధే తమ లక్ష్యమని బొల్లారం వెంకట్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హేమాచలుడిని దర్శించుకున్న ఎస్పీ

**క్రైమ్ మిర్రర్,మంగపేట:** మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మల్లూరు లక్ష్మీ నరసింహ స్వామిని శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ముందుగా ఆలయ సాంప్రదాయం ప్రకారం ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.గర్భలయంలో వారి పేరున అర్చన చేసి ఎస్పీ కుటుంబ సభ్యులకు స్వామి వారి విశిష్టత వివరించి ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు,శేష వస్త్రాలు



అందజేశారు.అనంతరం ఆలయ పరిసరాలను సందర్శించి క్షేత్ర విశిష్టతను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అలయ అర్చకులు,సిబ్బంది మంగపేట ఎస్సై సూరి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా అన్న సమారాధన కార్యక్రమం

### తీర్థప్రద ప్రసాదాలను స్వీకరించి విగ్నేశ్వరుని కృపకు పాత్రులైన భక్తులు

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 17 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజక వర్గం, వివేకానంద నగర్ డివిజన్ రామకృష్ణ వీధిలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్, గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడి దగ్గర అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాయినేని చంద్రకాంతరావు పాల్గొని అన్న సమారాధ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తాండవ కృష్ణ, సంజీవరెడ్డి, డాక్టర్ వంశీ, నరసింహారావు, అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి, కార్యదర్శి రామచంద్ర రావు, శ్రీధర్, లక్ష్మీనారాయణ, సుధాకర్, వెంకటేశ్వరరావు, చంగల్ రెడ్డి, గ్రానైట్ సూర్యనారాయణ, వేణుగోపాల్, యూత్ కమిటీ సభ్యులు నందు, అశ్విత్, భార్గవ్, రిత్విక్, రోహిత్, సాయి తదితరులు పాల్గొని విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు మహిళలకు యూత్ సభ్యులకు పేరుపేరునా అధ్యక్షులు జే పురంధర్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు



## పర్వేద గ్రామంలో వినాయక పూజా కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ సురేందర్ గౌడ్

### అన్నదాన కార్యక్రమానికి హాజరైన పర్వేద సర్పంచ్ సురేందర్ గౌడ్



**క్రైమ్ మిర్రర్ శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామంలో వినాయక నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో పర్వేద సర్పంచ్ సురేందర్ గౌడ్ పాల్గొన్నారు. అనంతరం భక్తుల కోసం నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి హాజరై భక్తులతో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురేందర్ గౌడ్ మాట్లాడుతూ వినాయక నవరాత్రులను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావం పెంపొందుతాయని అన్నారు.అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, శ్రీ వినాయకుడి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు, యువత, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలు



**క్రైమ్ మిర్రర్,మంగపేట:** కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు,కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి,మిఠాయిలు పంపిణి చేసి పైడాకుల అశోక్ కి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పైడాకుల అశోక్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ,ప్రజల మన్ననలు పొందుతూ రాజకీయ ప్రస్థానంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆక రాధాకృష్ణ,జిల్లా పార్టీ అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, భద్రాచల సీతారామచంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్,సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కర్రి నాగేంద్రబాబు,ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ సభ్యులు మురుకుట్ల నరేందర్,ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లికొండ యాదగిరి,మైప లాలయ్య,ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మూగల చంటి,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బసరికాని హరికృష్ణ,ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చాద మల్లయ్య,మైనారిటీ సెల్ అధ్యక్షుడు హిదయతుల్లా జిల్లా నాయకులు తుడి భగవాన్ రెడ్డి,మండల సోషల్ మీడియా ఇంచార్జీ భూక్యా కుమార్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వినాయక చవితి సందర్భంగా గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి రమేష్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 19 (క్రైమ్ మిర్రర్) :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత్ నగర్, కేపీహెచ్‌బీ 4వ ఫేజ్, కైతలాపూర్, రాఘవేంద్ర నగర్, ఆంజనేయ నగర్, మూసాపేట్ ప్రాంతాల్లోని గణేష్ మండపాలను సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు




అన్నదాన ప్రసాదాన్ని అందించారు. వినాయక చవితి సందర్భంగా ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యం కలగాలని బండి రమేష్ గణనాథుని ప్రార్థించారు. ఈ కార్యక్రమాల్లో



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

## ఫిరోజ్‌గూడలో 39 ఏళ్ల వ్యక్తి అదృశ్యం

### సదాశివ పాఠశాల సమీపంలో దిగిన అనంతరం కనిపించకుండా పోయిన జ్ఞాన రంజన్ మిశ్రా.. ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

**బాలానగర్, సెప్టెంబర్ 19 (క్రైమ్ మిర్రర్) :** ఫిరోజ్‌గూడలో 39 ఏళ్ల వ్యక్తి అదృశ్యమైన ఘటనపై బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కేసు నంబర్ 605/2026 కింద ఈ అదృశ్యం కేసు నమోదైంది. ఫిరోజ్‌గూడలోని ఫూల్‌బాగ్ కాలనీకి చెందిన జ్ఞాన రంజన్ మిశ్రా (39) ఈ నెల 15వ తేదీన రాత్రి సుమారు 10.20 గంటల సమయంలో సదాశివ పాఠశాల సమీపంలో దిగిన అనంతరం కనిపించకుండా పోయారు. అప్పటి నుంచి ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలించారు. ఫోన్ ద్వారా సంప్రదించేందుకు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ స్పందన లేకపోవడంతో బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### అదృశ్యమైన వ్యక్తి ఆనవాళ్లు

జ్ఞాన రంజన్ మిశ్రా 5 అడుగుల 8 అంగుళాల ఎత్తు, తెల్లని ఛాయతో, గుండ్రని ముఖంతో ఉంటారని పోలీసులు తెలిపారు. పై పెదవిపై గతంలో జరిగిన శస్త్రచికిత్సకు సంబంధించిన మచ్చ ఉన్నట్లు వివరించారు. ఆయన హిందీ, ఒడియా భాషలు మాట్లాడగలరు. అదృశ్యమైన సమయంలో ఎరుపు రంగు చొక్కా, తెల్లని ధోతి, గులాబీ రంగు తువ్వాలు ధరించి ఉన్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. జ్ఞాన రంజన్ మిశ్రా తండ్రి పేరు బృందావన్ మిశ్రా.



అదృశ్యమైన వ్యక్తి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసి ఆయన ఆచూకీ కోసం వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. పరిసర ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

### ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వండి

జ్ఞాన రంజన్ మిశ్రాను ఎవరైనా చూసినా, ఆయన ఆచూకీకి సంబంధించి ఏదైనా సమాచారం తెలిసినా వెంటనే బాలానగర్ పోలీసులకు తెలియజేయాలని పోలీసులు కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

బాలానగర్ పోలీస్ స్టేషన్: 8712663209
బాలానగర్ ఎస్‌హెచ్‌ఓ: 8712663200
సంప్రదింపు నంబర్: 9439522128


## రామప్ప దేవాలయంను సందర్శించిన స్విట్జర్లాండ్ దేశస్తులు

**వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్రర్ :** మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని శనివారం స్విట్జర్లాండ్ దేశానికి చెందిన అలెగ్జాండర్ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ లు ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం, కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, టూరిస్ట్ పోలీసులు అరుణ్, శ్రీకాంత్, బద్రు, దశరథ్, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.



## గచ్చిబౌలి గోపన్‌పల్లి లో అక్రమ భవనం కూల్చివేత....

**క్రైమ్ మిర్రర్ గచ్చిబౌలి :** గచ్చిబౌలి గోపన్‌పల్లిలో 50 గజాల స్థలంలో అక్రమంగా నిర్మించి పక్కకు ఒరిగిన నాలుగంతస్తుల భవనాన్ని జీహెచ్ఎంసీ అధికారులు శనివారం కూల్చివేస్తున్నారు. శుక్రవారం ఉదయం భవనం ఒరిగిపోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదాన్ని గుర్తించిన జీహెచ్ఎంసీ వెంటనే స్పందించి చుట్టుపక్కల ఇళ్లను ఖాళీ చేయించి, వోల్వో లాంగ్ బూమ్ క్రేన్ తో కూల్చివేత పనులు చేపట్టింది.ప్రస్తుతం కూల్చివేత పనులు కొనసాగుతున్నాయి.



# గణనాథుని మండపాల వద్ద అన్నదానంలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 19 (క్రైమ్ మిర్రర్) :** గణనాథుని నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా శనివారం బాలకృష్ణ నగర్, సాయిబాబా నగర్ కాలనీ, ఆల్విన్ కాలనీ, వివేకానంద నగర్ కాలనీలలో కొలువుదీరిన గణనాథుని మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మండప నిర్వాహకుల ఆహ్వానం మేరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గణనాథుని మండపాలను సందర్శించి స్వామివారి దివ్య దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించి, భక్తులతో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.గణేశ్ నవరాత్రుల సందర్భంగా భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్న మండప నిర్వాహకులను రాజేశ్వరరావు అభినందించారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా తమ ఆహ్వానాన్ని స్వీకరించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించినందుకు మండప నిర్వాహకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ని



ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక భక్తులు, యువత, మండప నిర్వాహకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో గిరిజనులను పట్టించుకోలేదు --- రాజు నాయక్

## బీఆర్ఎస్ హయాంలో గిరిజనులకు మొండి చెయ్యి - కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

## బీఆర్ఎస్ నేతల తప్పుడు ప్రచారంపై సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రాజు నాయక్ ఆగ్రహం

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా: మహేశ్వరం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ విలేకరుల సమావేశం నిర్వహించారు..ఈ సమావేశంలో మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నేనావత్ రాజు నాయక్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు గిరిజనుల పేరుతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.అడవి బిడ్డలకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించింది, భూములు, ఇళ్లు ఇచ్చి ఆదుకుంది ఇందిరమ్మేనని, కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు ఎప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పదేళ్లు అధికారంలో ఉన్నా గిరిజనుల అభివృద్ధికి పైసా ఖర్చు చేయలేదని విమర్శించారు.ఇప్పుడు మళ్లీ కేసీఆర్ కు పాలాభిషేకం చేస్తామనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సహకారంతో మహేశ్వరం మండలంలోని ప్రతి గిరిజన తండాను అభివృద్ధి చేస్తామని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలను ప్రతి గిరిజన కుటుంబానికి అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, గిరిజన నాయకులు కృష్ణ నాయక్, పాండు నాయక్, ఆంద్య నాయక్, దేవేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


# అంబేద్కర్ నగర్ వినాయకుడిని దర్శించుకున్న కర్క నాగరాజు



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 19 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గం, మూసాపేట్ డివిజన్‌లోని అంబేద్కర్ నగర్ లో అంబేద్కర్ అమరజ్యోతి అసోసియేషన్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని కూకట్‌పల్లి నియోజకవర్గం ఐఎన్టియుసి అధ్యక్షుడు కర్క నాగరాజు సందర్శించారు. ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఉత్సవ కమిటీ నిర్వాహకులు బోడ శివ ఆధ్వర్యంలో కర్కనాగరాజును ఘనంగా శాలువాతో సత్కరించారు.ఈకార్యక్రమంలో పెరుమాండ్ల టీంకు, జెల్ల సాయి, కర్క భార్గవ్, కర్కలోహిత్ రాజ్, కార్తీక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రుల పూజ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గణేష్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 19 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గ ఉమ్మడి అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో గల మహంకాళి నగర్, జయశంకర్ కాలనీ, పీజేఆర్ నగర్, పంచమి కాలనీ, ఆల్విన్ కాలనీ, తులసి నగర్ తదితర వినాయక మండపాల్లో నెలకొల్పిన విగ్నేశ్వరుని ప్రత్యేక పూజ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా గణేష్ మాట్లాడుతూ ఆల్విన్ డివిజన్ పరిధిలోని వివిధ వినాయక మండపాల్లో పూజా కార్యక్రమాలకు విశిష్ట అతిథిగా పిలవడం ఆనందంగా ఉందని, ఈ గణేష్ నవరాత్రులు ప్రతి కాలనీలో కులమతాలకు అతీతంగా అందరూ ఐక్యమత్యంతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అలాగే ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు మన అందరి పైన ఉండాలని మనసారా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, యాదగిరి, లాలం, అరుణ్, సందీప్, శ్రీనివాస్, కిట్టు, తదితరులతోపాటు కాలనీ కమిటీ సభ్యులు, వినాయక మండపాలు ఆర్గనైజర్స్, భక్తులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## కూచిపూడి--భరతనాట్య ప్రదర్శనతో

# ఆకట్టుకున్న లాస్యప్రియ

**ప్రతిభకు రూ.10 వేల నగదు బహుమతి అందజేసిన సాధు ప్రతాపరెడ్డి**



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 19 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, బాలాజీ నగర్ హౌసింగ్ బోర్డు కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం నిర్వహించిన కూచిపూడి, భరతనాట్య నృత్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. కుమారి లాస్యప్రియ తన అద్భుతమైన నృత్య ప్రదర్శనతో అలరించారు. సంప్రదాయ నృత్యరీతుల్లో ఆమె కనబరిచిన ప్రతిభకు కార్యక్రమానికి హాజరైన వారు ప్రశంసలు కురిపించారు. లాస్యప్రియ ప్రతిభను అభినందించిన కాలనీ అధ్యక్షుడు సాధు ప్రతాపరెడ్డి, ఆమెను, ఆమె తల్లిదండ్రులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం లాస్యప్రియ ప్రదర్శించిన నృత్యాలకు గుర్తింపుగా రూ.10 వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా సాధు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. లాస్యప్రియలో మంచి కళాత్మక ప్రతిభ ఉందని, సంప్రదాయ నృత్యకళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో ఆమెకు అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు.లాస్యప్రియ తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమార్తె ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన సాధు ప్రతాపరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కళాకారులను ప్రోత్సహించడం ద్వారా యువతలో సాంస్కృతిక కళల పట్ల మరింత ఆసక్తి పెరుగుతుందని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

# శ్రీనివాస్ నగర్ ఇండ్ల సమస్యపై భవిష్యత్తు కార్యాచరణ చేపడతాం - నున్నా, వై విక్రమ్

**రాజకీయాలు చేయకుండా పేదల వైపు వుండేది ఎర్ర జెండాలు మాత్రమే - నున్నా, వై విక్రమ్**

**హైకోర్టు ఉత్తర్వు నేపథ్యంలో బాధితులతో సభ నిర్వహించిన సి పి ఎం పార్టీ...**





**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** సి పి ఎం పార్టీ హైకోర్ట్ లో వేసిన పిటిషన్ నేపథ్యంలో శ్రీనివాస్ నగర్ బాధితులకు ఊరట రావడంతో సి పి ఎం పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప స్వామి గుడి వద్ద సభ నిర్వహించారు. భవిష్యత్తులో శ్రీనివాస్ నగర్ ఇళ్ళ సమస్య శాశ్వతంగా పరిష్కారం ఎలా చేయాలి అనే దానిపై ప్రజల అభిప్రాయాలను నాయకులు తీసుకున్నారు. ఈ సభలో పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర్రావు, డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా వరుసగా శ్రీనివాస్ నగర్ ఇళ్ళ సమస్యపై ఒకవైపు ప్రత్యక్ష ఆందోళన చేస్తూనే మరోవైపు సి పి ఎం పార్టీ హైకోర్ట్ తలుపు తట్టడం ఫలితంగా తాత్కాలిక ఊరట లభించింది అని తెలిపారు. అయితే భవిష్యత్తులో శ్రీనివాస్ నగర్ ఇళ్ళ స్థలాల సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే విధంగా సి పి ఎం పార్టీ ఆందోళనలు చేయడంతో పాటు కోర్టు లో కూడా సీనియర్ లాయర్ లతో ప్రజల వైపు వాదనలను బలంగా వినిపిస్తాము అని హామీ ఇచ్చారు. గత 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేదల కుటుంబాలు ఇక్కడే నివాసం శాశ్వతంగా వుండే విధంగా తమ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. శ్రీనివాస్ నగర్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వివిధ రాజకీయ పార్టీలు కేవలం కంటితుడుపు ఆందోళనలు చేస్తున్నాయి అని, కేవలం లెఫ్ట్ పార్టీలు మాత్రమే బాధితుల వైపు వుండి పోరాటాలు చేస్తున్నాయి అని తెలిపారు. నిజాయితీ గా పేదల సమస్యలపై పోరాటాలు చేసేది కేవలం ఎర్ర జెండాలు మాత్రమే అని స్పష్టం చేశారు. ఓట్లు అప్పుడు మాత్రమే మిగతా పార్టీలు కనిపిస్తాయి అని ఆరోపించారు. భవిష్యత్తులో శ్రీనివాస్ నగర్ ఇళ్ళ సమస్య శాశ్వతంగా పరిష్కారం అయ్యే వరకు సి పి ఎం పార్టీ అటు కోర్టు లోనూ, ఇటు ప్రజా క్షేత్రంలో నూ ప్రజల వైపు వుంటుంది అని తెలిపారు. జిల్లా కలెక్టర్, మంత్రి, కమీషనర్ జోక్యం చేసుకుని పేదల ఇళ్లు కాపాడే విధంగా వుండాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భుక్యా శ్రీనివాసురావు, బండారు రమేష్, సైదులు, యర్రా గోపి, నాగుల మీరా, ఇమామ్, యర్రా రంజిత్, లాయర్ టి లింగయ్య తదితరులు పాల్గొన్నారు

# వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి

**భక్తిశ్రద్ధలతో గణనాథునికి పూజలు.. అన్నప్రసాద వితరణ ప్రారంభం**



**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 19 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా పాపిరెడ్డి నగర్‌లోని రోడ్డు నంబర్ 8బీ బ్లాక్, 11సీ బ్లాక్, 15బీ బ్లాక్‌లలో స్థానికులు ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను వెంకటేశ్వర నగర్ డివిజన్ పాపిరెడ్డి నగర్ కాంటెస్టెడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో కొలువుదీరిన గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మండపాల నిర్వాహకులు దొడ్ల రామిరెడ్డి, విజయ్ గుప్తా, ఎడ్ల సంపత్ రెడ్డి తదితరులు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డితో పాటు ఇతర నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

**భక్తులకు అన్నప్రసాద వితరణ**

మండపాల నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి కృపాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఆ గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని కోరుకుంటున్నాను" అని శ్రీధర్ రెడ్డి అన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు కాలనీల్లో ఐక్యత, సోదరభావాన్ని చాటుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న మండపాల నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చర్ల రామకృష్ణారెడ్డి, గడ్డం రాజేశ్వర్ రెడ్డి, మాయ రాజయ్య, సింగిరెడ్డి భూపాల్ రెడ్డి, చిట్టిరెడ్డి గోపాల్ రెడ్డి, వావిళ్ల బగ్గయ్య, డాకురి అక్కిరెడ్డి, మాయ బాలనర్సయ్య, వంగూరి శరత్ రెడ్డి, దొడ్ల సాయిరెడ్డి, ఎడ్ల శ్యామ్‌సుందర్ రెడ్డి, మల్లేష్, ఎసిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కర్ల తిరుపతి రెడ్డి, ప్రశాంత్, శ్రీనివాస్ రెడ్డి, మధు, వెంకట్ రెడ్డి, సాయిబాబా, మల్లారెడ్డి, దామోదర్ రెడ్డి, షెర్లీ, వినయ్, రాజిరెడ్డి, బాలరాజు, జగన్‌మోహన్ రెడ్డి, వీరచారి, లక్ష్మీనారాయణ, కృష్ణారెడ్డి, రాజేందర్, రవి, నర్సింహులు తదితర నాయకులు, కార్యకర్తలు, వినాయక మండపాల నిర్వాహకులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

# బాలాపూర్ మహా గణనాధుడిని దర్శించుకున్న అందెల శ్రీరాములు

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) ప్రసిద్ధి గాంచిన బాలాపూర్ మహా గణనాధుడిని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ అందెల శ్రీరాములు కుటుంబ సమేతంగా, బీజేపీ శ్రేణులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు అందెల శ్రీరాములు ను సత్కరించి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ, బాలాపూర్ మహా గణనాధుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని, విఘ్నాలను తొలగించి ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యాలను ప్రసాదించాలని గణనాధుడిని ప్రార్థించానని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, మహేశ్వరం నియోజకవర్గ ప్రజలందరికీ మంచి జరగాలని, సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని స్వామివారిని కోరుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షులు, పదాధికారులు, మాజీ కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# శివశంకర్‌నగర్ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

## తాత్కాలిక చర్యలతో ప్రయోజనం లేదు..

## శాశ్వత ప్రణాళికతో సమస్యను పరిష్కరించాలి: కాంగ్రెస్ నాయకులు



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 19 (క్రైమ్ మిర్రర్):** ఫతేనగర్ డివిజన్ పరిధిలోని శివశంకర్‌నగర్, ఎల్‌బీఎస్ నగర్ ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు సరిగా ప్రవహించకపోవడం, పరిసరాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ నాయకులు శనివారం ఫతేనగర్ డివిజన్ వాటర్ వర్క్స్ మేనేజర్ ఇందూజాను కలిసి వినతిపత్రం అందజేశారు. శివశంకర్‌నగర్, ఎల్‌బీఎస్ నగర్ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలను ఆమెకు వివరించారు. ఎస్‌టీపీతో ఇబ్బందులు.. శాశ్వత పరిష్కారం అవసరం స్థానిక ప్రాంతాల్లోని మురుగునీటి శుద్ధి కేంద్రం కారణంగా బస్తీల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా నాయకులు మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. డ్రైనేజీ నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడకుండా, మురుగునీరు నిల్వ ఉండకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని కోరారు.

వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని, మురుగునీరు ఇళ్ల పరిసరాల్లోకి చేరితే ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని తెలిపారు. అందువల్ల అప్పటికప్పుడు చేపట్టే తాత్కాలిక మరమ్మతులతో సమస్యను వాయిదా వేయకుండా, డ్రైనేజీ వ్యవస్థను సమగ్రంగా పరిశీలించి శాశ్వత పరిష్కారానికి అవసరమైన ప్రణాళిక రూపొందించాలని కోరారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవాలి డ్రైనేజీ సమస్య కారణంగా దోమలు, దుర్వాసన, అపరిశుభ్ర వాతావరణం వంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యను అత్యవసరంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మేనేజర్ ఇందూజాను విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే డ్రైనేజీ సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షుడు కే. రమేష్, డీసీసీ కార్యదర్శి కే. వినయ్, ఎం.డి. హమీద్, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చీటకోరు కృష్ణ, సీనియర్ నాయకులు రవి, వరాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ధశీసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జనం కు ఏర్పాట్లు... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

## వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు

## వినాయక నిమజ్జనానికి పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి

## దంసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్, సిపి

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. శనివారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని దంసలాపురం చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పోలీస్ కమీషనర్ సునీల్ దత్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వినాయక నిమజ్జనం పురస్కరించుకొని కావాలసిన సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో గణేష్ ఉత్సవాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఘనంగా నిర్వహించేందుకు అన్ని సౌకర్యాలతో ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువులో నీటిమట్టం ఉన్నందున బారికేడింగ్, గజ ఈతగాళ్ళు, క్రేన్లు, బోట్లు, రక్షణ పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, పోలీసులతో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, రాత్రి నిమజ్జనాలకు తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్,



ప్రవేశ--నిష్క్రమణ మార్గాలను ముందుగానే సిద్ధం చేసి, అత్యవసర వాహనాలకు ఇబ్బంది లేకుండా చూడాలని తెలిపారు. ఎత్తు కలిగిన గణేష్ విగ్రహాలకు ఇబ్బందులు లేకుండా నిమజ్జన ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక రూట్, ట్రాఫిక్, పోలీసు బందోబస్తు, రవాణా ఏర్పాట్లు ముందుగానే చేయాలని ఆదేశించారు. భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని, నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వినాయక విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ షాక్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం లేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీస్ అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కలెక్టర్ కోరారు. ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని, 108 వాహనం, పాము కాటు మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద షిఫ్టుల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించి నిరంతరం పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద క్రేన్లకు అదనపు డ్రైవర్లు, క్రేన్ మరమ్మతులు చేసే మెకానిక్‌లను అందుబాటులో ఉంచాలని అన్నారు. నిమజ్జనం రోజున ఉదయం 6 గంటలకే క్రేన్లు సిద్ధంగా ఉండేలా చూడాలని సూచించారు. విగ్రహాల తరలింపుకు అడ్డుగా వచ్చే చెట్టు కొమ్మలను ముందుగానే తొలగించాలని అన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన మేరకు గజ ఈతగాళ్లను షిఫ్టుల వారీగా నియమించాలని, స్విమ్మర్లతో ముందుగానే చర్చించి వారికి విధుల షిఫ్ట్ వివరాలను తెలియజేయాలని అన్నారు. గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన రూట్ మ్యాప్‌ను ముందుగానే సిద్ధం చేయాలని, .అన్ని శాఖలు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేసి గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ తహసీల్దారు జయచందర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫతేనగర్‌లో వీధి దీపాల నిర్వహణ పనులు పూర్తి

## గణేష్ టెంపుల్ నుంచి పైప్‌లైన్ రోడ్డు వరకు వెలుగులు..
## రాత్రి వేళల్లో రాకపోకలకు మరింత సౌకర్యం

### డిసిసి కార్యదర్శి కే వినయ్ ముదిరాజ్



**బాలానగర్,శ్రీ సెప్టెంబర్ 19:(క్రైమ్ మిర్రర్):** మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని 260 గణేష్ టెంపుల్ నుంచి పైప్‌లైన్ రోడ్డు వరకు చేపట్టిన వీధి దీపాల ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. దీంతో ఇప్పటివరకు రాత్రి వేళల్లో చీకటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు, వాహనదారులకు మెరుగైన వెలుతురు అందుబాటులోకి వచ్చింది. వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో ప్రధాన రహదారితో పాటు పరిసర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో రాకపోకలు సులభతరం కానున్నాయి. ముఖ్యంగా చీకటి కారణంగా పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తగ్గడంతో పాటు రాత్రి సమయంలో ప్రయాణించే వారికి భద్రతా భావన పెరుగుతుందని స్థానికులు పేర్కొన్నారు. ప్రజల రోజువారీ అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీధి దీపాల పనులు పూర్తి చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రహదారులపై తగినంత వెలుతురు ఉండటం వల్ల రాత్రి వేళల్లో ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యం కలుగుతుందని తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లోనూ అవసరమైన చోట్ల వీధి దీపాలను ఏర్పాటు చేసి, పనిచేయని దీపాలను ఎప్పటికప్పుడు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి, మేడ్చల్ జిల్లా వినయ్ ముదిరాజ్, మాజీ డివిజన్ అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, వరలస్వామి, హమీద్, నర్సింగ్, చేతుకూరి కృష్ణ, తమిళ్ రవి తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించే ప్రజావాణి రద్దు... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఈ నెల 21న (సోమవారం) ఖమ్మం కలెక్టరేట్ లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని అనివార్య పరిపాలనా కారణాల రీత్యా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. మండల, డివిజన్ల స్థాయిలో నిర్వహించబడే ప్రజావాణి కార్యక్రమం యధావిధిగా సోమవారం మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఇట్టి విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు.

# బాలాపూర్ మహా గణనాధుడి ని దర్శించుకున్న తన్నీరు హరీష్ రావు



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** ప్రసిద్ధి గాంచిన బాలాపూర్ మహా గణనాధుడిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సిద్దిపేట నియోజకవర్గ శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. అనంతరం బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు కళ్లెం నిరంజన్ రెడ్డి ఇతర ప్రతినిధులు తన్నీరు హరీష్ రావును సత్కరించి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

# పిడుగుపాటుకు పాడి ఆవు మృతి

## వ్యవసాయ పొలంలో ఘటన.. రైతు కుటుంబంలో విషాదం




**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** మాడ్గుల మండల పరిధిలోని అందుగుల గ్రామంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి పిడుగుపడి పాడి ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు కొప్పుల పాపయ్య (లాలయ్య కుమారుడు) తన వ్యవసాయ పొలంలో కట్టివేసిన ఆవుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఇటీవల కాలం అనుకూలించకపోవడంతో వ్యవసాయంలో ఇబ్బందులు ఎదుర్కొంటూ సాగు కొనసాగిస్తున్న రైతు పాపయ్యకు పాడి ఆవు మృతి చెందడం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఉన్న పశువుల్లో ఒకటి పిడుగుపాటుకు మృతి చెందడంతో రైతు పాపయ్యతో పాటు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రభుత్వ అధికారులు ఘటనను పరిశీలించి పాడి ఆవు మృతికి సంబంధించిన నష్టపరిహారం అందించాలని రైతు కుటుంబం కోరుతోంది.

## బాలాపూర్ మహా గణనాధుడిని దర్శించుకున్న మధు యాష్కి గౌడ్



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) ప్రసిద్ధి గాంచిన బాలాపూర్ మహా గణనాధుడిని మాజీ పార్లమెంటు సభ్యులు మధు యాష్కి గౌడ్, రంగారెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు మధు యాష్కి గౌడ్, చల్ల నరసింహారెడ్డి లను సత్కరించి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.

# 136 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

## రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి చొరవతో మంజూరు..

## లబ్ధిదారులకు అందజేసిన మంత్రి పొంగులేటి ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** పేదలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, ఆర్థికంగా అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా సహాయం అందిస్తోందని తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఫారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం నేలకొండపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 136 మంది లబ్ధిదారులకు మంత్రి ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యం చేయించుకున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పేదల వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని దయాకర్‌రెడ్డి తెలిపారు. నేలకొండపల్లి మండలంలో త్వరలోనే ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తవుతుందని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ పంటలు సాగు చేపట్టిన రైతులకు ఇబ్బందులు కలగకుండా పాలేరు రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందించినట్లు చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించడమే మంత్రి పొంగులేటి లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొడాలి గోవిందరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బొందయ్య, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మామిడి వెంకన్న, పసుపులేటి శ్రీలత పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# బాలాపూర్ మహా గణనాధుడిని దర్శించుకున్న ఎంపీ ఈటల రాజేందర్



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** ప్రసిద్ధి గాంచిన బాలాపూర్ మహా గణనాధుడిని మాజీ మంత్రి, మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు ఈటల రాజేందర్ ను సత్కరించి లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, బాలాపూర్ మహా గణనాధుడి ఆశీస్సులతో దేశ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని, విఘ్నాలను తొలగించి ప్రజల జీవితాల్లో శాంతి, సౌభాగ్యాలను ప్రసాదించాలని గణనాధుడిని ప్రార్థించానని పేర్కొన్నారు.

# తెలంగాణ యువతకు భవిష్యత్ సాంకేతిక నైపుణ్యాలు

## ఉపాధి అవకాశాలే లక్ష్యంగా 'ఉడాన్' కార్యక్రమం



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** తెలంగాణ యువతను భవిష్యత్ సాంకేతిక రంగానికి సిద్ధం చేయడంతో పాటు, నైపుణ్యాల ఆధారంగా ఉపాధి అవకాశాలతో అనుసంధానం చేయడమే లక్ష్యంగా 'ఉడాన్' కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. టాస్క్--డెల్ టెక్నాలజీస్ భాగస్వామ్యంతో అమలు చేయనున్న ఈ కార్యక్రమంపై ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షతన హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, ఐటీ అండ్ సి జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి ఐఏఎస్, స్టేట్ కౌన్సిల్ సెక్రటరీ రామ్, టాస్క్ సీఈవో నితిన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**5,500 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ...**

టాస్క్--డెల్ టెక్నాలజీస్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంలో భాగంగా తెలంగాణలో 5,500 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు 'ఉడాన్' కార్యక్రమాన్ని రూపొందించారు. రాష్ట్రంలోని 25 కేంద్రాల్లో మూడు నెలలపాటు శిక్షణ నిర్వహించనున్నారు. సాంకేతిక నైపుణ్యాలతో పాటు పరిశ్రమల అవసరాలు, ఉద్యోగానికి అవసరమైన సామర్థ్యాలు, భవిష్యత్ ఉపాధి అవకాశాలపై శిక్షణలో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ ఢిల్లీ రూపొందించిన పాఠ్య ప్రణాళిక ఆధారంగా శిక్షణ అందించనుండగా, డెల్ టెక్నాలజీస్ సాంకేతిక సహకారం అందించనుంది. కృత్రిమ మేధస్సు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, క్లౌడ్ కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్స్ తయారీ, డిజిటల్ నైపుణ్యాలు వంటి రంగాల్లో యువతకు శిక్షణ ఇవ్వనున్నారు.

**గ్రామీణ యువతకు సైతం అవకాశాలు...**

ఈ సందర్భంగా టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతిక రంగానికి అనుగుణంగా యువతకు నైపుణ్యాలను అందించడంతో పాటు వాటిని పరిశ్రమల అవసరాలతో అనుసంధానం చేయడమే 'ఉడాన్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు చదువు పూర్తయ్యే వరకు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, చదువుకుంటున్న సమయంలోనే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేలా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల యువతకు కూడా ఆధునిక సాంకేతిక శిక్షణ అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగాలు, శిక్షణతో కూడిన ఉద్యోగ అవకాశాలు, స్వయం ఉపాధి దిశగా యువత ముందుకు వెళ్లేలా సమగ్ర మార్గాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

**విద్య నుంచి ఉపాధి వరకు....**

యువతకు కేవలం శిక్షణ అందించడం కాకుండా.. సాంకేతిక నైపుణ్యాలు, పరిశ్రమల పరిచయం, ఉద్యోగానికి సన్నద్ధత, ఉద్యోగ అవకాశాలు, శిక్షణతో కూడిన ఉపాధి, స్వయం ఉపాధి వంటి దశలతో విద్య నుంచి ఉపాధి వరకు సమగ్ర మార్గాన్ని రూపొందించడమే 'ఉడాన్' లక్ష్యమని తెలిపారు. దేశవ్యాప్తంగా ఐదు ప్రధాన టెక్నాలజీ కేంద్రాల్లో అమలు చేయనున్న 'ఉడాన్' కార్యక్రమంలో హైదరాబాద్ కూడా కీలక కేంద్రంగా ఎంపికైంది. డెల్ టెక్నాలజీస్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో డెల్ టెక్నాలజీస్, ఎఫ్ ఐ టి టి--ఐఐటి ఢిల్లీ, లర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, జనరేషన్ ఇండియా ఫౌండేషన్ భాగస్వాములుగా వ్యవహరించనున్నాయి. ప్రభుత్వం, టాస్క్, డెల్ టెక్నాలజీస్, లర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సమన్వయంతో కార్యక్రమాన్ని అమలు చేయడం ద్వారా తెలంగాణ యువతలో 21వ శతాబ్దపు ఉద్యోగ నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు నైపుణ్యాలను ఉపాధి అవకాశాలతో అనుసంధానం చేసే దిశగా చర్యలు చేపట్టనున్నారు. సమావేశంలో లర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సి ఓ ఓ నిఖిల్, డెల్ టెక్నాలజీస్ సీనియర్ అకౌంట్ మేనేజర్--గవర్నమెంట్ కె. కృష్ణకిషోర్, డెల్ టెక్నాలజీస్ ఏపీజెసి రీజినల్ సీఐఓ, హైదరాబాద్ సైట్ డైరెక్టర్ రమేష్ జంపుల తదితరులు పాల్గొన్నారు.



# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే ఉత్తమ్ లక్ష్యం

### తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

**కోదాడ, సెప్టెంబర్ 19 (క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో ఏ ప్రాంతానికి చెందిన నిరుద్యోగ యువతకైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే తపనతోనే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇంత పెద్ద మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని చేపట్టారని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. కోదాడ సీసీ రెడ్డి కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానించి, వేలాది మంది నిరుద్యోగ యువతను ఒకే వేదికపైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చేస్తున్న కృషికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రిగా కూడా రాష్ట్ర రైతాంగ ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేస్తున్నారని గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. రైతులు రెండు పంటలు పండించుకునేలా సాగునీరు అందించడంతో పాటు, పండించిన పంటలను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందన్నారు.

తెలంగాణలో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లను సమర్థవంతంగా చేపట్టడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. రైతులు, నిరుద్యోగ యువత, ప్రజల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో తాము ఎప్పటికప్పుడు వివిధ అంశాలపై చర్చిస్తూ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు.

# 100 అడుగుల రోడ్డు వద్దు.. 60 అడుగుల రోడ్డు ముద్దు

### కిస్మత్‌పూర్‌లో రోడ్డుపై వేడెక్కిన వివాదం..

### రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ఎదుట బాధితుల నిరసన

### తమ ఇళ్లను, జీవనోపాధిని దెబ్బతీసేలా రోడ్డు విస్తరణ వద్దంటున్న స్థానికులు..

### బీఆర్ఎస్ ఫ్లెక్సీలను చింపివేసిన బాధితులు




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కిస్మత్‌పూర్‌లో ప్రతిపాదిత 100 అడుగుల రోడ్డు వ్యవహారం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. రోడ్డు విస్తరణతో తమ ఇళ్లు, ఆస్తులు నష్టపోయే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు.. 100 ఫీట్ల రోడ్డు వద్దు.. 60 ఫీట్ల రోడ్డు ముద్దు అంటూ నిరసనకు దిగారు. రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ముందు బాధితులు పెద్ద సంఖ్యలో ఆందోళన నిర్వహించారు. కిస్మత్‌పూర్ ప్రాంతంలో 100 అడుగుల రోడ్డు నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనపై కొంతకాలంగా స్థానికుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు విస్తరణ జరిగితే తమ నివాసాలు, స్థలాలు ప్రభావితమవుతాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఉన్న రహదారిని 60 అడుగుల మేర అభివృద్ధి చేస్తే ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు తమ ఆస్తులకు భారీ నష్టం వాటిల్లదని వారు పేర్కొంటున్నారు. 100 అడుగుల రోడ్డు ప్రతిపాదనను పునఃపరిశీలించి 60 అడుగుల రహదారిని ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రోడ్డు అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే అభివృద్ధి పేరుతో తమ ఇళ్లు, ఆస్తులను కోల్పోయే పరిస్థితి తీసుకురావద్దని కోరుతున్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ వ్యవహారంలో రాజకీయ నాయకులు తమ స్వప్రయోజనాల కోసం వివిధ రకాల నాటకాలు ఆడుతున్నారని కొందరు బాధితులు ఆరోపించారు. ప్రజల సమస్యను పరిష్కరించకుండా రాజకీయ ప్రయోజనాల కోసం ఆందోళనలు నిర్వహించడం సరికాదని వారు మండిపడ్డారు. తమ ఇళ్లు, స్థలాల విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. మరోవైపు 100 అడుగుల రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కూడా ఆందోళన చేపట్టారు. దీంతో ఒకే రహదారి విషయంలో స్థానికుల్లో భిన్నాభిప్రాయాలు బహిర్గతమయ్యాయి. ఒకవైపు 100 అడుగుల రోడ్డు కావాలని కొందరు డిమాండ్ చేస్తుండగా.. మరోవైపు తమ ఆస్తులకు నష్టం కలిగించేలా 100 అడుగుల రోడ్డు వద్దని బాధితులు స్పష్టం చేస్తున్నారు. నిరసన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొందరు బాధితులు చింపివేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తమ సమస్యను పట్టించుకోకుండా రాజకీయంగా వ్యవహరిస్తున్నారనే ఆగ్రహంతోనే ఫ్లెక్సీలను తొలగించినట్లు బాధితులు పేర్కొన్నారు. కిస్మత్‌పూర్‌లో 100 అడుగుల రోడ్డు వ్యవహారం రాజకీయ రంగు పులుముకోవడంతో పాటు స్థానికుల ఆస్తులు, ట్రాఫిక్ అవసరాలు, భవిష్యత్ అభివృద్ధి వంటి అంశాలపై చర్చకు దారితీస్తోంది. అధికారులు అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు నిర్మాణంపై తుది నిర్ణయం తీసుకునే ముందు బాధితుల అభ్యంతరాలను పరిశీలించి, ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

# మహిళా పోలీసుల సాధికారతకు మరో ముందడుగు

## ఆర్బీవిఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ--ఉమీద్ మధ్య అవగాహన ఒప్పందం




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది, అధికారుల వృత్తిపరమైన అభివృద్ధి, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సామర్థ్యాలను మరింత పెంపొందించే దిశగా ఆర్బీవిఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ , ఉమీద్ స్వచ్ఛంద సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఏకశిల అడ్మినిస్ట్రేటివ్ భవనంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఉమీద్ సీఈఓ ఉదితా చద్దా అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ వృత్తిపరంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగడానికి నిరంతర మార్గదర్శకత్వం, మెంటరింగ్, ప్రోత్సాహం అవసరమని పేర్కొన్నారు. మహిళా పోలీసు సిబ్బందిలో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, వృత్తిపరమైన సామర్థ్యాలను పెంపొందించేందుకుఉమీద్తో కుదిరిన అవగాహన ఒప్పందం మంచి వేదికగా నిలుస్తుందని అన్నారు. వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, వృత్తిపరమైన మార్గదర్శకత్వం వంటి అంశాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమీద్ సహ-వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు గౌరీ మహేంద్ర మాట్లాడుతూ.. తెలంగాణ పోలీస్ అకాడమీతో కుదుర్చుకోవడం తమ సంస్థకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి వివిధ హోదాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులకు సరైన మార్గదర్శకత్వం, మెంటరింగ్, ప్రోత్సాహం అందించడం ద్వారా వారి సామర్థ్యాలను మరింత వెలికితీయవచ్చని తెలిపారు. మహిళా పోలీసుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడం, విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేలా ప్రోత్సహించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, దిశానిర్దేశంలో మహిళా పోలీసులకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. అవగాహన ఒప్పందంలో భాగంగా మహిళా పోలీసుల కోసం గైడెన్స్, మెంటరింగ్ సెషన్స్, ప్రేరణాత్మక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ నైపుణ్యాల అభివృద్ధి, కమ్యూనికేషన్ స్కిల్స్, వృత్తిపరమైన సామర్థ్యాల పెంపుదల వంటి కార్యక్రమాలను దశలవారీగా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ చేతన, మురళీధర్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు వేమా శ్రీనివాసరెడ్డి, యార్లగడ్డ రాంబాబు, వేముల శ్రీనివాసరావు, నరహరి, డిఎస్పీలు ఆదూరి శ్రీనివాసరావు, దేవారెడ్డి, లా ఫ్యాకల్టీ వరలక్ష్మి, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ యాదమ్మ పాల్గొన్నారు.

# నార్సింగిలోనే సర్కిల్ కార్యాలయాన్ని కొనసాగించాలి

## మణికొండకు తరలించవద్దంటూ అధికారులకు బీఆర్ఎస్ నాయకుల వినతి

## దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, దెబ్బతిన్న రోడ్లను వెంటనే మరమ్మతు చేయాలని విజ్ఞప్తి




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నార్సింగి సర్కిల్-45 కార్యాలయాన్ని నార్సింగ్ నుంచి మణికొండకు తరలించే ప్రతిపాదనను విరమించుకోవాలని బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు అధికారులను కోరారు. సర్కిల్ కార్యాలయాన్ని నార్సింగిలోనే కొనసాగించాలని కోరుతూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, నార్సింగి డిప్యూటీ కమిషనర్‌లకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నార్సింగ్ సర్కిల్ అధ్యక్షుడు కే. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. నార్సింగి సర్కిల్ పరిధిలోని అన్ని గ్రామాలకు నార్సింగ్ భౌగోళికంగా మధ్యలో ఉంటుందని తెలిపారు. జన్వాడ, మిర్జాగూడ, మియాఖాన్‌గడ్డ, ఖానాపూర్, వట్టినాగులపల్లి, మంచిరేవుల తదితర గ్రామాలు, కాలనీల ప్రజలకు నార్సింగ్‌లో కార్యాలయం ఉండటం ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యాలయాన్ని మణికొండకు తరలిస్తే దూరప్రాంతాల ప్రజలు ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తుందని, దీంతో సమయం, రవాణా ఖర్చులు పెరిగి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ముఖ్యంగా వృద్ధులు, రోజువారీ కూలీలు, సామాన్య ప్రజలకు ఈ నిర్ణయం భారంగా మారుతుందని వివరించారు. నార్సింగిలో ఇప్పటికే విద్యుత్ శాఖ, జలమండలి, పోలీస్ స్టేషన్, ఏసీపీ కార్యాలయం, గ్రామీణ ఆరోగ్య కేంద్రం, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వంటి ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని గుర్తుచేశారు. మున్సిపల్ సర్కిల్ కార్యాలయం కూడా నార్సింగిలోనే కొనసాగితే ప్రజలకు వివిధ ప్రభుత్వ సేవలు ఒకే ప్రాంతంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. మణికొండలో ఇప్పటికే జనసాంద్రత, ట్రాఫిక్ సమస్యలు ఉన్న నేపథ్యంలో అక్కడికి కార్యాలయాన్ని తరలిస్తే ప్రజలకు మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అధికారులు ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకుని కార్యాలయ తరలింపు ప్రతిపాదనను పునఃపరిశీలించి, నార్సింగ్‌లోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

**దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి...**

నార్సింగి పరిధిలోని హాలో దోమల ప్రాంతంలో దోమల బెడద అధికంగా ఉందని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. దోమల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని, మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నార్సింగ్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ద్వారా కోరారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పలుచోట్ల రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని, దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. దెబ్బతిన్న రోడ్లను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ అధ్యక్షుడు షేక్ ముక్తార్, పెద్దపులి కిషన్, మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్ యాదవ్, గణేష్ ముదిరాజ్, గణేష్ రెడ్డి, చిరంజీవి, సతీష్, మహిపాల్, శ్రీకాంత్ రెడ్డి, పి. శంకర్, డి. రవీంధర్, వై. ప్రకాష్, రజనీకాంత్, శ్రీనివాస్, పసుల మహేందర్, దాకూరి వంశీ, మస్కురి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ ప్రభుత్వం ఎప్పుడు వస్తుందోనని అన్నదాతలు ఎదురుచూపులు

కరెంటు లేక రాత్రి అనకా పగలనకా పొలాలలో విలవిలలాడుతున్న అన్నదాతలు

కేసీఆర్ హయంలో 30 శాతం నీళ్లు వాడుకున్నాం

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జూరాల, కేఎల్ఐ ప్రాజెక్టులు ఎండిపోయే పరిస్థితి

ఉమ్మడి పాలమూరులో ఆనాడు పెండింగ్ ప్రాజెక్టులను పరుగు పెట్టించింది బీఆర్ఎస్

బీఆర్ఎస్ తెలంగాణ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్





**వనపర్తి సెప్టెంబర్ 19 క్రైమ్ మిర్రర్:** కృష్ణా నది నీటిని వాడుకున్నది పాలమూరుకు బిడ్డగా పేరున్న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. శనివారం కొల్లాపూర్లోని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి. తండ్రి బీరం లక్ష్మారెడ్డి గారి అంత్యక్రియలకు హాజరైన ఆయన తిరుగు ప్రయాణంలో పెబ్బేరు మండలంలోని గుమ్మడం గ్రామంలో పర్యటించారు. కరెంటు కోసం రైతులు పడుతన్న ఇబ్బందుల దృష్ట్యా గుమ్మడం సబ్స్టేషన్ వద్ద రైతులతో మాట్లాడారు. సబ్స్టేషన్ సిబ్బందితో రైతులకు ఎన్ని గంటలు కరెంటు ఇస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం పెబ్బేరుకు చేరుకొని అంబేద్కర్ చౌరస్తా నుంచి సుభాస్ చౌరస్తా వరకు భారీ ర్యాలీగా వచ్చి అక్కడ మాట్లాడారు. అనంతరం అక్కడి నుంచి వనపర్తి వెళ్లే దారిలో ఉన్న పీజేపీ లెఫ్ట్ కెనాల్ను పరిశీలించి మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ కరుణశ్రీ స్వగృహంలో నిర్వహించిన ప్రెస్ మీట్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పాలమూరు బిడ్డ సీఎం రేవంత్ రెడ్డి సాగుకు నీటిని ఇవ్వకుండా పాలమూరు రైతులను మోసం చేసిండని.. తన గురువు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరిక మేరకు శ్రీశైలం నుంచి100 టీఎంసీ ల నీళ్లించ్చిండని గుర్తు చేశారు. జూరాలలో నీళ్ళున్నా 18 టీఎంసీ లు మాత్రమే చివరి దశలో ఇచ్చిండని ఫైర్ అయ్యారు. సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లెలో రైతులు కరెంటు లేక రోడ్డెక్కితే ఎల్నినో పేరు చెప్పి రైతులను హరిగోస పెడుతున్నడని మండిపడ్డారు. తొక్కుకుంటూ వచ్చినా అన్న సీఎం రేవంత్ రెడ్డి.. పాలమూరు రైతులను పండబెట్టిండని ఎద్దేవా చేశారు. జూరాల, ఆల్మట్టి, నారాయణపూర్ లో నీరు పుష్కలంగా ఉన్నాయని, ఎల్నినో పేరు చెప్పి పాలమూరు రైతులను ఆగం చేస్తున్నాడని ఫైర్ అయ్యారు. అండగా కేసీఆర్ ఉన్నాడని, జూరాల ఆయకట్టు చివరి బొట్టు రైతులకు అందేవరకు కొట్లాడతామని హెచ్చరించారు. పాలమూరు రైతులను, పాలమూరును ఎండబెడుతున్నది కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ హయంలో కృష్ణా నది నుంచి 30 శాతం నీళ్లను వాడుకున్నామని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జురాల, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులు ఎండిపోయే పరిస్థితికి తీసుకొచ్చారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందు చూపు లేకనే ఈ దుస్థితి నెలకొందని.. కర్ణాటక, ఏపీ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నా కృష్ణా జలాల విషయంలో తెలంగాణ రాష్ట్రం ప్రణాళికతో లేదని అన్నారు. ఆలమట్టి ఎత్తు పెంచే యోచనలో కర్ణాటక రాష్ట్రం ఉందని.. దీంతో పాలమూరు కు భవిష్యత్తు లో నీళ్ళు రావని, ఈ విషయం మీద పక్కనే ఉన్న కర్ణాటకను ఎందుకు నిలదీయట్లేదని ప్రశ్నించారు. ఐదు మీటర్ల ఎత్తుకి కర్ణాటక కాంగ్రెస్ రూ.లక్ష కోట్లు ఖర్చు పెడుతుందని, కృష్ణా జలాల్లో పాలమూరు వాటా దక్కే వరకు ఊరుకోము అని హెచ్చరించారు. ఉమ్మడి పాలమూరులో ఆనాడు పెండింగులో ఉన్న ప్రాజెక్టులను పరుగులు పెట్టించింది కేసీఆర్ అని.. బీఆర్ఎస్ ప్రభుత్వమని చెప్పుకొచ్చారు. కృష్ణానది నుంచి నీళ్లు వస్తున్నాయి అంటే చెరువులను నింపి అపారంగా చెక్ డ్యామ్లను కట్టించి ఎండిపోయిన వాటిలో సైతం జలకళను తెప్పించింది కేసీఆర్ ప్రభుత్వమని అన్నారు. శాశ్వత దీర్ఘకాలిక ప్రయోజాన్ని ఒనగూర్చే పాలమూరు -- రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేసి నార్లాపూర్ వద్ద పంపును ప్రారంభించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పెబ్బేరు మండల, పట్టణ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పాలమాకుల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. నలుగురు మృతి



గండిపేట(క్రైమ్ మిర్రర్):శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలమాకుల గ్రామ శివారులో ఎన్ హెచ్-44పై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గణేష్ నిమజ్జనం అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం మెట్టుగడ్డ తండాకు చెందిన కుటుంబ సభ్యులు ఇన్నోవా వాహనం టిఎస్07జిజెడ్9333లో శంషాబాద్ వైపు వస్తుండగా పాలమాకుల సమీపంలో వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో వాహనంలో ప్రయాణిస్తున్న కేతావత్ లింబ్యా (54), ఆయన భార్య కేతావత్ జమున (45), కత్రావత్ మాన్సింగ్ (48), కేతావత్ వస్రామ్ (45) మృతి చెందారు. ప్రమాదంలో డ్రైవర్ సబావత్ అశోక్ తీవ్రంగా గాయపడగా, వెంటనే శంషాబాద్‌లోని ట్రైడెంట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులంతా మెట్టుగడ్డ తండాకు చెందినవారేనని పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

## అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పద్యాల తోరణం పోటీలు



గండిపేట(క్రైమ్ మిర్రర్): జ్ఞాన సరస్వతి ఫౌండేషన్, అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక, ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల విద్యార్థులకు మండల స్థాయిలో పద్యాల తోరణం కార్యక్రమం నిర్వహించారు. రాజేంద్రనగర్ మండల స్థాయి పోటీలు అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతీ దేవి పూజ నిర్వహించి జ్యోతి ప్రజ్వాలన చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత సభకు అధ్యత వహించి మాట్లాడుతూ తెలుగు భాష పట్ల దినదినానికి తగ్గుతున్న ఆదరణ బాధ కలిగిస్తుందన్నారు. నిజానికి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మనమందరం తేనెలాంటి మధురమైన మాతభాషను ఎప్పుడూ మరచిపోవద్దని అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష గొప్పదనాన్ని కొనియాడారు. కార్యక్రమంలో నిర్వహకులు శ్రీనివాస సాగర్, బాలకృష్ణ, యాదిలాల్, సత్యన్న, సరిత, లింగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు రజియాబేగం, సాయిప్రసాద్‌రావు, రోజారాణి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంధ్యానగర్ కాలనీ అభివృద్ధి, నీటి సమస్య పరిష్కరించాలి




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** బండ్లగూడ జాగీర్‌లోని సంధ్యానగర్ కాలనీ అభివృద్ధికి చర్యలు చేపట్టడంతో పాటు, తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆరామైసమ్మ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్‌ను కోరారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసి కాలనీలో నెలకొన్న సమస్యలను వివరించారు. కాలనీ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ముఖ్యంగా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. కాలనీలోని ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాగర్ గౌడ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు



## తెలంగాణ ఆధునిక పోలీసింగ్‌పై బీహార్ డీఎస్పీలకు అవగాహన



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ పోలీసింగ్‌లో అమలు చేస్తున్న ఆధునిక విధానాలు, సాంకేతిక పరిజ్ఞానంపై బీహార్‌కు చెందిన 54 మంది డీఎస్పీలకు అవగాహన కల్పించారు. ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో సెప్టెంబర్ 14 నుంచి 19 వరకు నిర్వహించిన ఆరు రోజుల ఇన్-సర్వీస్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ హాజరై డీఎస్పీలతో ఇంటరాక్షన్ నిర్వహించారు. సైబర్ నేరాల దర్యాప్తు, డ్రగ్స్ నియంత్రణ, మహిళలు--పిల్లల భద్రత, కమాండ్ కంట్రోల్ వ్యవస్థలు, టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్‌పై వివరించారు. శిక్షణలో భాగంగా బీహార్ డీఎస్పీలు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఈగల్, భరోసా కేంద్రాలు, షీ టీమ్స్, గ్రేహౌండ్స్, సైబరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. సైబర్ దర్యాప్తు, డిజిటల్ ఆధారాల సేకరణ, డ్రగ్ నెట్‌వర్క్‌ల గుర్తింపు, మహిళలు--బాలల రక్షణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వివిధ రాష్ట్రాల పోలీస్ అధికారుల మధ్య అనుభవాల మార్పిడి ద్వారా ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవచ్చని అభిలాష బిస్త్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ఏడి వేమా శ్రీనివాసరెడ్డి, డీఎస్పీలు ఆదూరి శ్రీనివాసరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



## అత్తాపూర్ ఇస్కాన్ ఆలయంలో ఘనంగా రాధాష్టమి వేడుకలు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అత్తాపూర్‌లోని ఇస్కాన్ ఆలయంలో శనివారం రాధాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. రాధారాణి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం మంగళహారతితో ప్రారంభమైన వేడుకల్లో గురుపూజ, శృంగార దర్శన హారతి, రాధారాణి లీలలపై ప్రత్యేక ప్రవచనం నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు మహా అభిషేకం చేపట్టారు. మధ్యాహ్నం రాజభోగ హారతి అనంతరం భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేశారు. రాధాష్టమి వేడుకలకు సుమారు 10 వేల మంది భక్తులు, సందర్శకులు హాజరయ్యేలా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు మహాప్రసాదం అందించేలా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



## 20 రోజులుగా మున్సిపల్ నీళ్లు బంద్..

వాటర్‌బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా

హిమగిరి, వెస్టన్ కాలనీల వాసుల ఆందోళన

సమస్య పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిక



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** వర్షాకాలం కొనసాగుతున్నప్పటికీ తాగునీటి సమస్యతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, ప్రస్తుతం జీహెచ్ఎంసీ 123వ డివిజన్ పరిధిలో ఉన్న హిమగిరి కాలనీ, వెస్టన్ కాలనీలకు గత 20 రోజులుగా మున్సిపల్ నీటి సరఫరా నిలిచిపోయిందని స్థానికులు ఆరోపించారు. నీటి సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కాలనీ వాసులు వాటర్‌బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను కలిసి సమస్యను వివరించగా, అధికారులు పరస్పర విరుద్ధమైన సమాధానాలు ఇస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజువారీ అవసరాలకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే నీటి సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే వాటర్‌బోర్డు కార్యాలయం వద్ద ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని కాలనీ వాసులు హెచ్చరించారు. అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వాలని, నిరంతర నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీ ప్రజల ఆందోళనకు మద్దతు తెలిపారు. ప్రజల సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు


# నోరు విప్పితే బి ఆర్ ఎస్ నాయకుల బండారం బయటపడుతుంది: కాంగ్రెస్ సంచలన హెచ్చరిక..!

**ఫ్యూచర్ సిటీకి అడ్డుపడుతున్న బి ఆర్ ఎస్ బినామీ బ్యాచ్ --- అక్రమ ఆస్తుల చిట్టా తీస్తాం..**

**అభివృద్ధి నిరోధకురాలు సబితా ఇంద్రారెడ్డి --- మహేశ్వరంలో కాంగ్రెస్, వెర్సెస్ బి ఆర్ ఎస్ మాటల యుద్ధం..?**

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. బి ఆర్ ఎస్ నాయకులపై కాంగ్రెస్ పార్టీ సంచలన ఆరోపణలు చేసింది. మేము మౌనంగా ఉన్నామని అలుసుగా తీసుకుంటే, మండలంలోని బి ఆర్ ఎస్ నాయకుల అక్రమ ఆస్తుల చిట్టా మొత్తం బయటపెడతామని ఘాటుగా హెచ్చరించారు..తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కె ఎల్ ఆర్) ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో నూతన మండల కమిటీ ఏర్పాటు అనంతరం మీడియాతో మాట్లాడిన కాంగ్రెస్ నేతలు బి ఆర్ ఎస్ పై విరుచుకుపడ్డారు.




**ఫ్యూచర్ సిటీ విషయంలో బి ఆర్ ఎస్ డ్రామా..!**

మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని జె ఎ సి గా ఏర్పడి, అన్ని పార్టీల మద్దతు కోరితే బి ఆర్ ఎస్ సర్పంచులు, నాయకులు కావాలనే మద్దతు ఇవ్వలేదని ఆరోపించారు. అభివృద్ధిని అడ్డుకుని, ఇప్పుడు మేమే మంత్రిని కలిసి మద్దతు ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. దమ్ముంటే బి ఆర్ ఎస్ తరఫున ఎంతమంది సర్పంచులు ఫ్యూచర్ సిటీకి మద్దతు ఇస్తున్నారో లిఖితపూర్వకంగా ఇవ్వాలని సవాల్ విసిరారు.మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై ఫైర్ మహేశ్వరం, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తన నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసి, ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని, నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు.గిరిజన నాయకులను అవమానిస్తే ఊరుకోమని, గిరిజనులకు గుర్తింపు ఇచ్చిందే కాంగ్రెస్ అని, తెలియకపోతే మీ తాతలను అడిగి తెలుసుకోండని బి ఆర్ ఎస్ నేతలకు చురకలు అంటించారు. పదేళ్ల బి ఆర్ ఎస్ పాలనలో తండాలను పంచాయతీలుగా చేసి గాలికి వదిలేశారని, కె ఎల్ ఆర్ చొరవతోనే ఇప్పుడు ప్రతి పంచాయతీ అభివృద్ధి **చెందుతోందని స్పష్టం చేశారు.మీ ఆస్తులు ఎన్ని..?:**

మీడియా ముందు విర్రవీగుతున్న బి ఆర్ ఎస్ గిరిజన నాయకుల్లారా... మహేశ్వరం మండలంలో మీకు ఎన్ని ఎకరాలు, ఎన్ని ఆస్తులు ఉన్నాయో మా దగ్గర లెక్క ఉందని, ఇకనైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే అన్నీ బయటపెడతామని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మహేశ్వర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య, మండలం మాజీ అధ్యక్షులు కాకి ఈశ్వర్, మహేశ్వర మండల సర్పంచ్ పోరం అధ్యక్షులు రాజు నాయక్, చిన్న తుప్పర సర్పంచ్ రాజు, వర్కల యాదగిరి గౌడ్, జగన్మోహన్ రెడ్డి పెండ్యాల సర్పంచ్, సుభాన్పూర్ సర్పంచ్ మల్లేష్, రామచంద్రగూడ సర్పంచ్ దేవేందర్ నాయక్ , ఉప సర్పంచ్ భాస్కర్ నాయక్,అల్లే కుమార్,వెంకట్ రెడ్డి, కూన యాదయ్య, ఆవుల యాదయ్య, పెండ్యాల ఉప సర్పంచ్ మంత్రి అంజయ్య, మంత్రి బాల్రాజ్,మహేశ్వర్ మండల బిసి సెల్ అధ్యక్షులు బొల్లు కుమార్ యాదవ్, నరసింహ యాదవ్, నడికుడ శివ, లోకేశ్వర్ రెడ్డి, హాజీ బాబా గిరిజన నాయకులు కృష్ణ నాయక్, పాండు నాయక్, అంద్య నాయక్, దేవేందర్ నాయక్, భాస్కర్ నాయక్ రవీందర్ నాయక్, నరసింహ నాయక్, హరిచంద్, నాగేందర్ లక్ష్మణ్ నాయక్, రవి నాయక్, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## విఘ్నేషా మీ చల్లని ఆశీస్సులు అందరిపై ఉండాలి.

రాజేంద్రనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పి. అర్చన జయప్రకాష్.

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** విఘ్నేషా....మీ చల్లని ఆశీస్సులు అందరిపై ఉండాలని రాజేంద్రనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పి. అర్చనా జయప్రకాష్ వేడుకొన్నారు. గణపతి నవరాత్రులు భాగంగా శివరాంపల్లి ప్రశాంత్ కాలనీ పొదుపు ఆధ్వర్యంలో నిర్వహించినగణపయ్య పూజలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొదుపు సంఘం కార్యవర్గ సభ్యులు ఆర్ కమలేష్ కుమార్, ఎన్ శేఖర్, కె గణేష్, సిద్ధం శ్రీనివాస్, డి ఆంజనేయులు, పి వెంకటేష్, కే శ్రీనివాస్, మల్లేష్, వెంకటేశ్వర్లు, ఎన్.నరసింహ, మల్లికార్జున్ గౌడ్ ఇతర సభ్యులు వారిని శాలువాలతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు కుమార్ వారిని తీర్థప్రసాదులతో ఆశీర్వదించారు. అనంతరం అన్నప్రసాదాన్ని ప్రధానం చేశారు. అదేవిధంగా ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గగన్ పహాడ్ యాదయ్య, పోరెడ్డి ధర్మారెడ్డి, ఎస్ దుర్గేష్ తదితరులు ఈ పూజలో పాల్గొని తీర్థ ప్రసాదలను స్వీకరించారు. అనంతరం భక్తులు ఆటపాటలతో ఘణపయ్యను కొలిచారు. కే గణేష్, పి వెంకటేష్ దంపతులు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజా కార్యక్రమంలో నిర్వహించారు.

## మణికొండలో గణేశ్ మండపాల్లో ఘనంగా పూజలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నెక్నాంపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి సందర్శించారు. ఆయా మండపాల్లో కొలువుదీరిన శ్రీ విఘ్నేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గణనాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం పలు గణేశ్ మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. గణేశ్ ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యతను పెంపొందిస్తున్నాయని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, యువజన సంఘాల సభ్యులు, గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు



గండిపేట(క్రైమ్ మిర్రర్): బండ్లగూడ జాగిర్ గంధంగూడలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. సెప్టెంబర్ 14 నుంచి 18 వరకు ప్రతిరోజూ ఉదయం 8.30 గంటలకు, సాయంత్రం 6 గంటల నుంచి 6.30 గంటల వరకు ప్రత్యేక పూజలు, ఆరాధనలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం ఉదయం 9 గంటలకు శ్రీ లక్ష్మీ గణపతి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గణపతి లడ్డూ వేలంపాట, నిమజ్జన కార్యక్రమం, అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. పెద్ద లడ్డూ వేలంపాటలో రావికంటి వినయ్‌కుమార్ రూ.61,000లకు లడ్డూను కైవసం చేసుకున్నారు. మహిళల చిన్న లడ్డూ వేలంపాటలో మేడిశెట్టి మల్లీశ్వరి మహిళా సిండికేట్ గ్రూప్ రూ.1,01,116లకు లడ్డూను దక్కించుకుంది. దీపకుందుల వేలంలో శ్రీమతి బొడ్ల విజయ సూర్యనారాయణ రూ.10,001లకు కైవసం చేసుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం గణపతి విగ్రహాన్ని భక్తులు జయజయధ్వానాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం దేవాలయ ఆవరణలోని నీటి కొలనులో మట్టి గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. నిమజ్జనం అనంతరం సుమారు 200 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. భక్తుల పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో దేవాలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నిర్వాహకులు ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన భక్తులు, మహిళలు, యువతకు కృతజ్ఞతలు తెలిపారు.

# సుగురు కుమ్మరి వీధిలో గణేష్ నిమగ్నం ఘనంగా వేడుకలు

**వనపర్తి సెప్టెంబర్ 19 క్రైమ్ మిర్రర్:** ప్రతి ఇంట్లో వాడవాడల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకునే వినాయక చవితి సందర్భంగా పెబ్బేరు మండలం సుగురు గ్రామం కుమ్మరి వీధిలో బొజ్జ గణపయ్యకు. లడ్డు. గుండ్రాల పాయసంతో. ప్రసాదాలతో ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరవ రోజు శనివారం గణేశుని నిమగ్నానికి కుమ్మర సంఘం కమిటీ ఆధ్వర్యంలో. బొజ్జ గణపయ్య చేతిలో ఐదు రోజులు పూజలు చేసిన లడ్డు 32 వేల రూపాయలకు. సూర్యవంశం తేజ దక్కించుకున్నారు. అదేవిధంగా స్వామివారికి ఇష్టమైన ఎలుక పండ్లతో పాటు రకరకాల పండ్లను 4200 రూపాయలకు సూర్యవంశం పరుశరాముడు వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి. దక్కించుకున్నారు. స్వామివారి కి కలశంలో టెంకాయలతో పూజ చేసిన టెంకాయలు 2000 రూపాయలకు. సూర్యవంశం హర్షవర్ధన్ పెబ్బేరు మండలం కుమ్మర సంఘం అధ్యక్షులు దక్కించుకున్నారు. స్వామివారి కండువా పంచ 2000 రూపాయలు .సూర్యవంశం శ్రీకాంత్ దక్కించుకున్నారు. స్వామివారి పలుక బలపం 1500 రూపాయలకు సూర్యవంశం శివ. గ్రామ కుమ్మర సంఘం అధ్యక్షుడు దక్కించుకున్నాడు.. 50 రూపాయల లక్కీ డిప్ లో లడ్డును కుమ్మరి బాలరాజు దక్కించుకున్నారు. కమిటీ సభ్యు లు డప్పు వాయిదాలతో డీజేలతో అంగరంగ వైభవంగా నిమగ్నం చేశారు.. జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యవంశం పరశురాముడు మాట్లాడుతూ విఘ్నాలను తొలగించి విజయాలను అందించేలా వినాయక చవితిని గ్రామాలలో కాలనీలు, పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుండా వాడవాడలా అన్ని వర్గాలు వారు ఎంతో ఘనంగా ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారు .అన్ని అన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఒక్కచోట చేర్చే గొప్ప సామాజిక పండుగ వినాయక చవితి. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని వానలు కురిసి అందరూ ఆనందపడేలా చేయాలని మనస్ఫూర్తిగా ఆ దేవుని కోరుకుంటున్నామని తెలిపారు. పెబ్బేరు మండల కుమ్మర సంగం అధ్యక్షుడు సూర్యవంశం హర్షవర్ధన్ మాట్లాడుతూ.మట్టి వినాయక ప్రతిమలను పూజిస్తూ, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ మన సంస్కృతి, సంప్రదాయాలను మరింత వైభవంగా జరుపుకుందామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో . కుమ్మర సంఘం నాయకులు. శేఖర్. ఎల్ల స్వామి. భరతుడు. వెంకటస్వామి. శ్రీరాములు. సహదేవుడు. రఘువరన్. కర్ణ. జితేందర్. మహేష్. దశరథ. రమేష్. నవీన్. వేణు. బన్నీ. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు



## రాజీవ్ రహదారిపై ప్రమాద బాధితులను ఆదుకున్న బండి సంజయ్

**డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన కారు.. బాలికకు తీవ్ర గాయాలు**

**ఘటనను గమనించి తన కాన్వాయ్‌ను ఆపిన కేంద్ర మంత్రి**

**గాయపడిన వారిని తన భద్రతా వాహనంలో ఆసుపత్రికి తరలింపు**

కేంద్ర సహాయ మంత్రి, బీజేపీ సీనియర్ నేత బండి సంజయ్ మానవత్వాన్ని చాటుకున్నారు. మార్గమధ్యంలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని గమనించిన ఆయన, వెంటనే తన కాన్వాయ్‌ను నిలిపివేసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రమాదానికి గురైన బాధితులను తన భద్రతా వాహనంలోనే ఆసుపత్రికి తరలించి అండగా నిలిచారు.శనివారం సిద్దిపేట నుంచి గజ్వేల్ వైపు వెళుతున్న ఒక కారు రాజీవ్ రహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదం సమయంలో ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో కారు నడుపుతున్న వ్యక్తి, ముందు సీటులో ఉన్న ఆయన భార్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయితే, వెనుక సీటులో కూర్చున్న వారి కుమార్తెకు తల, ముక్కు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి.అదే సమయంలో సిరిసిల్ల వైపు వెళు తున్న బండి సంజయ్ ఈ ప్రమాదాన్ని గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపి, భద్రతా సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో చిక్కుకున్న బాధితులను బయటకు తీయడంలో స్వయంగా సహాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన బాలికను, ఆమె తల్లిదండ్రులను వెంటనే తన కాన్వాయ్‌లోని భద్రతా వాహనంలో ఆసుపత్రికి తరలించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. ఆపదలో ఉన్నవారిని సకాలంలో ఆదుకున్న బండి సంజయ్ చొరవను పలువురు అభినందించారు.

## తిరుమలలో వైభవంగా సాగిన గరుడ సేవ..

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన గరుడ వాహన సేవ శనివారం రాత్రి అంగరంగ వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. గరుత్మంతునిపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన శ్రీ మలయప్పస్వామి వారు తిరుమాడ వీధుల్లో విహరిస్తూ లక్షలాది మంది భక్తులకు అభయమిచ్చారు. ఈ అపురూప దృశ్యాన్ని కనులారా వీక్షించేందుకు తరలివచ్చిన భక్తుల “గోవిందా.. గోవిందా..” నామస్మరణలతో సప్తగిరులు మార్మోగాయి. శనివారం సాయంత్రం 6:30 గంటలకు వాహన మండపం నుంచి గరుడ వాహనంపై స్వామివారు బయటకు రాగానే, మాడ వీధుల్లోని గ్యాలరీలలో వేచి ఉన్న భక్తుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గజరాజులు ముందు నడుస్తుండగా, భజన బృందాలు, కోలాటాలు, జీయంగార్ల ఘోష్టి, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకుని పులకించిపోయారు.

**భక్తులతో కిక్కిరిసిన మాడ వీధులు**

గరుడ సేవను తిలకించేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. మాడ వీధుల్లోని 1.90 లక్షల మంది సామర్థ్యం గల గ్యాలరీలు శుక్రవారం రాత్రికే భక్తులతో కిక్కిరిసిపోయాయి. గ్యాలరీలలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ శనివారం ఉదయం నుంచే పాలు, అన్నప్రసాదాలు, తాగునీరు, అల్పాహారం వంటివి నిరంతరాయంగా అందించింది. సుమారు 2000 మంది శ్రీవారి సేవకులు ఈ పంపిణీ కార్యక్రమా ల్లో పాల్గొని భక్తులకు సేవలందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి స్వయంగా మాడ వీధుల్లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జేఈవోలు శరత్, గోపీనాథ్ శిలాతోరణం వద్ద క్యూలైన్లలోని భక్తులకు అందుతున్న అన్నప్రసాదం, నీటి సరఫరాను పరిశీలించారు. సీవీఎస్వో మురళీకృష్ణ, ఎస్పీ సుబ్బరాయుడు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలిచ్చారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.